www.udyamakeratam.com
RNI: TGTEL/25/A0273
1 వ వార్షికోత్సవం
# ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షిత:
UDYAMA KERATAM TELUGU DAILY
తెలుగు దినపత్రిక
| ఆసిఫాబాద్ | | సంపుటి: 2 | | సంచిక: 61 | | 12-8-2026 | | బుధవారం | | పేజీలు: 8 | | వెల : రూ.2/- |

## పార్లమెంటులో అదే ప్రతిష్టంభన
4



- లోక్‌సభలో విపక్ష ఎంపీల ఆందోళన
- సభను వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా

## కొలంబియాను కుదిపేసిన భూకంపం

- 7.4 తీవ్రతతో పెను ప్రకంపనలు
- 132కు చేరిన మృతుల సంఖ్య..
- 570 మందికి గాయాలు
- పలు నగరాల్లో భవనాలు నేలమట్టం..
- విమాన సేవలకు అంతరాయం

4



## మన్మోహన్ ప్రభావశీలి

- కోల్‌స్కామ్‌లో క్లీన్‌చిట్‌పై సోనియా కీలక వ్యాఖ్యలు
- మోడీ ఇకనైనా తనను తాను క్షమించుకోవాలంటూ చురక

4





# ఖేలో ఇండియాలో సత్తా చాటాలి

డిసెంబరులో యువ క్రీడా సంబరం

20 క్రీడాంశాల్లో జాతీయ స్థాయి పోటీలు

### స్టేడియాల ఆధునికీకరణకు అవసరమైన నిధులు
### ప్రారంభ, ముగింపు వేడుకలకు క్రీడా, సినీ ప్రముఖులు
### ఏర్పాట్లపై అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి దిశానిర్దేశం

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఆతిథ్యమివ్వనున్న 'ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026' పోటీలను అత్యున్నత ప్రమాణాలతో నిర్వహించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి, ఖేలో ఇండియా యూత్ గేమ్స్ 2026 ఏర్పాట్లు, నిర్వహణపై ఉన్నతాధికారులతో సీఎం సమీక్షా సమావేశం నిర్వహించారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి వేలాది మంది క్రీడాకారులు పాల్గొనే ఈ పోటీల కోసం అవసరమైన మౌలిక వసతులను వేగంగా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. డిసెంబరులో ఈ పోటీలను వైభవంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. హైదరాబాద్‌లోని క్రీడా ప్రాంగణాల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, వాటిని శాశ్వత ప్రాతిపదికన అంతర్జాతీయ స్థాయికి సరిపోయేలా అభివృద్ధి చేయాలని, ఇందుకు అవసరమైన నిధులను విడుదల చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

*- హైదరాబాద్, ఆగస్టు 11*

## పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి



- పెండింగ్ భూసేకరణ పనులు త్వరగా పూర్తి
- మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెట్రో ఫేజ్–2 పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశంచేశారు. ఎంజీబీఎస్ – చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు.
2

## గ్లోబల్ సమ్మిట్‌కు భారీగా ఏర్పాట్లు

- అంతర్జాతీయ దృష్టి ఆకర్శించేలా సమ్మిట్
- అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం

2

# రక్తమోడిన రహదారులు

### సంగారెడ్డిలో రెండు ఘోర ప్రమాదాల్లో 9మంది దుర్మరణం

- ఆటోను ఢీకొట్టిన ట్యాంకర్.. ఏడుగురు కూలీలు మృతి..
- ఐదుగురికి గాయాలు
- వెంకటాపూర్ కూడలి వద్ద మరో ప్రమాదం.. ఇద్దరు మృతి

.. వివరాలు 2లో





## 'చేయూత' పింఛన్లకు దరఖాస్తులు
3

ఆగస్టు 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు లేదు

## 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

- 15న సంగారెడ్డి నుంచి రేషన్ కార్డుల పంపిణీ
- సీఎం చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో కార్యక్రమాలు
- ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల సన్నబియ్యం
- ఏర్పాట్లలో ఎక్కడా లోటు ఉండొద్దు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

3





## ఆ సంస్థతో సీఎం సోదరుడికి సంబంధం లేదు

- నిబంధనల మేరకే సంస్థకు భూ కేటాయింపులు
- మంత్రి శ్రీధర్ బాబు స్పష్టీకరణ

3

## 22ఏ భూములపై ఆందోళన వద్దు

- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం
- దరఖాస్తుల పరిష్కారం యుద్ధప్రాతిపదికన చేపట్టాలి
- 14లోగా అన్ని పత్రాలు ఆన్‌లైన్‌లోకి
- సబ్ రిజిస్ట్రార్ విచక్షణాధికారాలకు చెక్
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ ప్రసక్తే లేదు
- మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

3





## రేవంత్ షెల్ కంపెనీల బాగోతం

- త్వరలోనే బండారం బయటపెడతాం
- సీఎం సోదరులంతా పెద్దపెద్ద కంపెనీ ఓనర్లు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి

3



# గల్లంతైన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది

## నటుడు ప్రకాశ్ రాజ్ సెల్ఫీ వీడియో

**బెంగళూరు, ఆగస్ట్ 11:** బెంగళూర్‌లో గల్లంతైన 65 లక్షల ఓట్లలో తనది కూడా ఉందని నటుడు ప్రకాశ్ రాజ్ తెలిపారు. ఈ విషయంపై సోషల్ మీడియాలో ఓ సెల్ఫీ వీడియోను పంచుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణపై మాట్లాడారు. సర్' తర్వాత బెంగళూరు నియోజకవర్గంలో తొలగించిన 65 లక్షల ఓట్లలో నాది కూడా ఉంది. ఇది చాలా హాస్యాస్పదంగా అనిపిస్తోంది. నేను ఈ నియోజకవర్గంలోనే పుట్టాను. ఇక్కడే నివసించాను. చదువంతా ఇక్కడే పూర్తయింది. నటన నేర్చుకుంది కూడా ఇక్కడే. అన్నిటికంటే ముఖ్యంగా.. నేను ఈ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా కూడా పోటీ చేశాను. అయినా నా ఓటును తొలగించారని ఆ వీడియోలో చెప్పారు. మళ్లీ ఓటర్ కార్డు పొందడానికి ఏ డాక్యుమెంట్లు అడుగుతారో అని వ్యంగ్యంగా అన్నారు. తాను అన్నిటికీ సిద్ధంగా ఉన్నానని చెప్పారు. 'మీకు ఓటు వేయని వారిని తొలగించే అధికారం మీకు ఉండొచ్చు. కానీ మిమ్మల్ని అధికారం నుంచి దింపకుండా మమ్మల్ని ఆపగలరా?' అని గేమ్ ఆన్ అంటూ ప్రశ్నించారు. ఇక ప్రకాశ్ రాజ్‌కు కర్ణాటక, తమిళనాడు, తెలంగాణతో సహా నాలుగు రాష్ట్రాల్లో ఓటరు కార్డులు ఉన్నాయనే ఆరోపణలపై ఇటీవల బెంగళూరులో కేసు నమోదైంది. నోటీసులకు స్పందించకపోవడంతో ఆయనపై నాన్-బెయిలబుల్ వారెంట్ కూడా జారీ చేశారు. ఈ కేసులో జులైలో బెంగళూరు కోర్టు ముందు ప్రకాశ్ రాజ్ హాజరుకాగా.. వాదనలు విన్న న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది.

# మండలస్థాయి ప్రజావాణి నిర్వహణ

## జీవో విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం

**హైదరాబాద్, ఆగస్ట్ 11:** తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మండల స్థాయిలో ప్రజావాణి నిర్వహించాలని నిర్ణయించింది. ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనుంది. ఈ మేరకు జీవో ఎంఎస్ నంబర్-4 ద్వారా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజావాణిపై ఎంపీడీవోలకు శిక్షణ, అవగాహన కార్యక్రమం నిర్వహించనుంది. ఆగస్టు 13వ తేదీన ఉదయం10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వారికి శిక్షణ ఇవ్వనుంది. హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఈ శిక్షణ కార్యక్రమం జరగనుంది. మండల నోడల్ అధికారులైన ఎంపీడీవోలు తప్పనిసరిగా ఈ శిక్షణకు హాజరు కావాలని తెలంగాణ సర్కార్ ఆదేశాలు జారీ చేసింది.

# లాఠీచార్జ్ సమర్థనీయమే

## పరిస్థితిని అదుపు చేసేందుకు తప్పదు

## సమర్థించుకున్న జార్ఖండ్ రాష్ట్ర పోలీస్ విభాగం

**రాంచీ, ఆగస్ట్ 11:** రాంచీలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమైన విద్యార్థుల ర్యాలీకి అడ్డంకులు సృష్టించిన వారి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజీని పరిశీలిస్తున్నారు. అయితే, అసెంబ్లీ వైపు పెద్ద సంఖ్యలో వస్తున్న విద్యార్థులను అదుపు చేసేందుకు పరిమితస్థాయిలో బలప్రయోగాన్ని రాష్ట్ర పోలీసు వర్గాలు సమర్థించుకున్నాయి. ర్యాలీ సందర్భంగా పోలీసులు వాటర్ క్యానన్, భాష్పవాయువును ప్రయోగించారు. లాఠీచార్జ్ కూడా జరిగింది. రోడ్డు క్లియర్ చేయాలని పదే పదే అభ్యర్థించినా నిరసన కారులు పట్టించుకోలేదని పోలీసు వర్గాలు తెలిపాయి. కొందరు బ్యారికేడ్లను ధ్వంసం చేశారని, వాహనాలను అడ్డుకున్నారని ఆరోపించాయి. మరోవైపు, ఎలాంటి హెచ్చరికలు లేకుండానే పోలీసులు బలప్రయోగానికి దిగారని విద్యార్థులు ఆరోపించారు. లాఠీ చార్జ్ సందర్భంగా కనీసం 100 మందికిపైగా విద్యార్థులపై పోలీసులు లాఠీ చార్జ్ చేశారని ఓ యువకుడు ఆరోపించారు. పరస్పర ఆరోపణల నేపథ్యంలో ర్యాలీకి సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని పోలీసులు పరిశీలిస్తున్నారు. అడ్డంకులు సృష్టించిన వారు ఎవరో తెలుసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. సోమవారం నాటి నిరసనల్లో 14 మంది పోలీసులకు గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. ఒకరికి తీవ్ర గాయమైందని అన్నారు. అయితే, పరిస్థితిని అదుపు చేసేందుకు వీలైనంత పరిమితిస్థాయిలోనే బలప్రయోగం చేశామని రాంచీ ఎస్ఎస్‌పీ రాకేశ్ రంజన్ చెప్పారు.

# ఎయిడ్స్ రహిత రాష్ట్రం లక్ష్యం

## నేడు హైదరాబాద్‌లో అవగాహనా ర్యాలీ

## వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**హైదరాబాద్, ఆగస్ట్ 11:** ఎయిడ్స్ రహిత తెలంగాణ తమ లక్ష్యమని వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ తెలిపారు. హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు బుధవారం భారీ ర్యాలీని నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. ఆగస్టు 12 నుంచి రెండు నెలల పాటు విస్తృత ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. హెచ్ఐవీ, ఎయిడ్స్, సిఫిలిస్ నియంత్రణెళి లక్ష్యంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. బుధవారం ఉదయం 7 గంటలకు హైదరాబాద్‌లో భారీ ర్యాలీ చేపట్టనున్నట్లు చెప్పారు. ఐమాక్స్ పక్కన ఉన్న హెచ్ఎండీఏ గ్రౌండ్స్ నుంచి నెక్లెస్ రోడ్ రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ కొనసాగనుందని మంత్రి తెలిపారు. సుమారు 1500 మంది ర్యాలీలో పాల్గొననున్నట్లు వెల్లడించారు. హెచ్ఐవీ బాధితులకు మెరుగైన వైద్య చికిత్స అందించడంపై ప్రత్యేక దృష్టి సారించామని మంత్రి తెలిపారు. హెచ్ఐవీ ఇతరులకు, ముఖ్యంగా పుట్టబోయే శిశువులకు సంక్రమించ కుండా అవగాహన కల్పిస్తున్నామన్నారు. సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ నిర్మూలన ప్రచారంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. 'బి పాజిటివ్ టు స్టాప్ హెచ్ఐవీ పాజిటివ్' నినాదంతో అవగాహన కల్పించ నున్నట్లు తెలిపారు. తెలంగాణను హెచ్ఐవీ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు.

# ఖేలో ఇండియాలో తెలంగాణ సత్తా చాటాలి

- డిసెంబరులో యువ క్రీడా సంబరం
- 20 క్రీడాంశాల్లో జాతీయ స్థాయి పోటీలు
- స్టేడియాల ఆధునికీకరణకు నిధులు
- ప్రారంభ, ముగింపు వేడుకలకు క్రీడా, సినీ ప్రముఖులు
- అధికారులకు సీఎం రేవంత్ దిశానిర్దేశం



**హైదరాబాద్, ఆగస్టు 12:** తెలంగాణ ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వనున్న ఖేలో ఇండియా యూత్ గేమ్స్-2026 పోటీలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దేశవ్యాప్తంగా తెలంగాణకు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చేలా క్రీడా స్ఫూర్తిని ప్రతిబింబించే స్థాయిలో ఏర్పాట్లు ఉండాలని స్పష్టం చేశారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలోని బోధి పెవిలియన్‌లో ఖేలో ఇండియా యూత్ గేమ్స్ ఏర్పాట్లు, నిర్వహణపై క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. డిసెంబరులో పోటీల నిర్వహణకు ఇప్పటి నుంచే సమగ్ర కార్యాచరణతో ముందుకు వెళ్లాలని సూచించారు. జాతీయ స్థాయిలో వివిధ రాష్ట్రాల నుంచి క్రీడాకారులు తరలిరానున్న నేపథ్యంలో వారికి అవసరమైన మౌలిక వసతులు, వసతి, రవాణాతో పాటు ఇతర సౌకర్యాల విషయంలో ఎక్కడా లోటు లేకుండా చూడాలని సీఎం ఆదేశించారు. ఆయా విభాగాల వారీగా అధికారులకు బాధ్యతలు అప్పగించి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు.

### శాశ్వత ప్రాతిపదికన స్టేడియాల అభివృద్ధి

హైదరాబాద్‌లోని స్టేడియాల ప్రస్తుత పరిస్థితిని పరిశీలించి, జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలకు అనుగుణంగా వాటిని శాశ్వత ప్రాతిపదికన అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందుకు అవసరమైన నిధులను అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. ఖేలో ఇండియా పోటీల కోసం చేపట్టే అభివృద్ధి పనులు భవిష్యత్తులోనూ రాష్ట్ర క్రీడాకారులకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు. ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌లో మొత్తం 20 క్రీడాంశాల్లో పోటీలు జరగనున్నందున ఒక్కో క్రీడకు అనువైన వేదికలను ముందుగానే గుర్తించాలని చెప్పారు. ఆయా వేదికల్లో అవసరమైన సదుపాయాలు, క్రీడా పరికరాలు, ప్రేక్షకుల సౌకర్యాలు తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు.

### వేడుకలకు ప్రత్యేక ఆకర్షణ

ప్రారంభోత్సవం, ముగింపు వేడుకలను ప్రత్యేక ఆకర్షణగా తీర్చిదిద్దాలని సీఎం సూచించారు. ముఖ్య అతిథులతో పాటు ప్రముఖ క్రీడాకారులు, సినీ ప్రముఖులను భాగస్వాములను చేసేందుకు ఇప్పటి నుంచే కసరత్తు ప్రారంభించాలన్నారు. తెలంగాణకు చెందిన అర్జున అవార్డు గ్రహీతలు, తెలంగాణ స్పోర్ట్స్ హబ్ బోర్డు సభ్యులు, ఒలింపిక్ సంఘం ప్రతినిధులు, జాతీయ స్థాయి క్రీడా ప్రముఖులను కూడా భాగస్వాములను చేయాలని చెప్పారు. మౌలిక వసతుల అభివృద్ధి, పోటీల నిర్వహణ, క్రీడాకారులు, అతిథులకు వసతి, రవాణా తదితర అంశాల్లో స్పష్టమైన పని విభజన చేసుకుని అధికారులు బాధ్యతతో వ్యవహరించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. తెలంగాణ క్రీడా సామర్థ్యాన్ని దేశానికి చాటిచెప్పేలా ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణ ఉండాలని స్పష్టం చేశారు. సమీక్షలో ప్రభుత్వ సలహాదారు కె. రామకృష్ణారావు, తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేనా రెడ్డి, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, క్రీడా ప్రాధికార సంస్థ ఎండీ ఎ. సోనీబాల దేవి తదితరులు పాల్గొన్నారు.

# పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

- పెండింగ్ భూసేకరణ పనులు త్వరగా పూర్తి
- మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు
- అధికారులతో సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం



**హైదరాబాద్, ఆగస్ట్ 11:** హైదరాబాద్ పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. మెట్రో ఫేజ్-2 పనుల్లో వేగం పెంచాలని దిశానిర్దేశంచేశారు. ఎంజీబీఎస్ - చాంద్రాయణగుట్ట మెట్రో కారిడార్‌పై కీలక నిర్ణయాలు తీసుకున్నామని పేర్కొన్నారు. 7.5 కిలోమీటర్ల మేర రోడ్డు విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. మెట్రో పనులకు వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలని సూచించారు. పాతబస్తీ మెట్రో పనులపై సంబంధిత అధికారులతో సీఎం మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్ భూసేకరణ పనులు వేగంగా పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి మార్గనిర్దేశం చేశారు. మెట్రో రద్దీకి అనుగుణంగా అదనపు కోచ్‌లు కొనుగోలు చేయాలని సూచించారు. ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రో సలహాలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. డిసెంబర్‌లో 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గత సమ్మిట్ పెట్టుబడులపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో ఇన్వెస్ట్ తెలంగాణ సమ్మిట్ నిర్వహణకు ప్లాన్ చేస్తున్నామని సీఎం పేర్కొన్నారు. తెలంగాణలో మరిన్ని పెట్టుబడులు ఆకర్షించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. వివిధ రంగాల్లో గుర్తింపు పొందిన ప్రముఖులను సన్మానించాలని సూచించారు. గత ఏడాది పెట్టుబడులు, పురోగతిపై పూర్తి వివరాలు ఇవ్వాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

# ప్రతి విద్యార్థికి ప్రపంచస్థాయి విద్య

## యంగ్ ఇండియా స్కూల్స్ లక్ష్యం

## ఎక్స్ వేదికగా సీఎం రేవంత్ వెల్లడి

**హైదరాబాద్, ఆగస్ట్ 11:** తెలంగాణ యంగ్ ఇండియా ఇంటిగ్రేట్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణాలు వేగంగా జరుగుతున్నాయని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. సోషల్ మీడియా ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. ప్రతి విద్యార్థికీ ప్రపంచ స్థాయి విద్యను అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో ఈ విద్యాలయాలు నిర్మితమవుతున్నా యని సీఎం వెల్లడించారు. 'భవనాలు నిర్మించడం సులభమే.. కానీ కలలకు పునాదులు వేయాలంటే ప్రభుత్వానికి సంకల్పం ఉండాలి. ఆ సంకల్పంతోనే తెలంగాణలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ వేగంగా రూపుదిద్దుకుంటున్నాయి. ఆర్థిక, సామాజిక అసమానతలకు ముగింపు పలుకుతూ.. కులం, మతం, ప్రాంతం, కుటుంబ నేపథ్యం అనే గీతలను చెరిపేస్తూ.. ప్రతి చిన్నారికి ప్రపంచ స్థాయి విద్యను అందించడమే మా ప్రభుత్వ లక్ష్యం. ప్రతి నియోజకవర్గంలో అత్యాధునిక వసతులతో నిర్మితమవుతున్న ఈ విద్యాలయాలు.. పేద కుటుంబాల పిల్లలను రేపటి శాస్త్రవేత్తలుగా, పరిపాలకులుగా, పారిశ్రామికవేత్తలుగా, నవభారత నిర్మాతలుగా తీర్చిదిద్దే జ్ఞాన మందిరాలుగా నిలవబోతున్నాయి. పేద పిల్లల కలలకు చిరునామాగా.. తెలంగాణ మోడల్‌కు ప్రతీకగా.. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరతరాల భవిష్యత్తును మార్చబోతున్నాయి' అంటూ ఎక్స్‌లో సీఎం రేవంత్ రెడ్డి పోస్ట్ చేశారు.

# గ్లోబల్ సమ్మిట్‌కు భారీగా ఏర్పాట్లు

## అంతర్జాతీయ దృష్టి ఆకర్శించేలా సమ్మిట్

## అధికారులకు సిఎం రేవంత్ దిశానిర్దేశం

**హైదరాబాద్, ఆగస్ట్ 11:** తెలంగాణలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించేలా డిసెంబర్‌లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌కు అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ సన్నద్ధతపై ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వ్యాపార రంగంలోని వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్‌లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గత ఏడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, వాటి పురోగతికి సంబంధించిన పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సలహాదారులు రామకృష్ణారావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రక్తమోడిన రహదారులు

- సంగారెడ్డిలో రెండు ఘోర ప్రమాదాల్లో 9 మంది దుర్మరణం
- ఆటోను ఢీకొట్టిన ట్యాంకర్.. ఏడుగురు కూలీలు మృతి
- మరో ఐదుగురికి తీవ్ర గాయాలు.. ఆస్పత్రికి తరలింపు
- వెంకటాపూర్ కూడలి వద్ద మరో ప్రమాదం.. ఇద్దరు మృతి



**సంగారెడ్డి, ఆగస్టు 11:** సంగారెడ్డి జిల్లాలో మంగళవారం జరిగిన రెండు వేర్వేరు ఘోర రోడ్డు ప్రమాదాలు తొమ్మిది మంది ప్రాణాలను బలిగొన్నాయి. జహీరాబాద్ మండలం సత్వార్ వద్ద వ్యవసాయ కూలీలతో వెళ్తున్న ఆటోను ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టడంతో ఏడుగురు దుర్మరణం చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలో జరిగిన మరో ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ఒకే జిల్లాలో రెండు ప్రమాదాల్లో తొమ్మిది మంది మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. కర్ణాటకలోని బీదర్ జిల్లా రాజగిరికి చెందిన వ్యవసాయ కూలీలు ప్రతిరోజూ కూలి పనుల కోసం జహీరాబాద్ పరిసర ప్రాంతాలకు వస్తుంటారు. ఎప్పటిలాగే మంగళవారం కూడా హుమనాబాద్ నుంచి జహీరాబాద్‌కు ఆటోలో బయలుదేరారు. ఆటోలో మొత్తం 14 మంది ఉన్నట్లు సమాచారం. జహీరాబాద్ మండలం సత్వార్ వద్దకు చేరుకున్న సమయంలో హైదరాబాద్ వైపు నుంచి కర్ణాటకకు వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ ఆటోను ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు ఆటోలో ప్రయాణిస్తున్న వారిలో ఏడుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను జహీరాబాద్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతులంతా బీదర్ జిల్లా రాజగిరికి చెందిన వ్యవసాయ కూలీలుగా గుర్తించారు.

### డివైడర్ దాటి దూసుకెళ్లిన కారు

ఈ విషాదం నుంచి తేరుకోకముందే జిల్లాలో మరో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. కోహీర్ మండలం వెంకటాపూర్ కూడలి సమీపంలోని 65వ నంబరు జాతీయ రహదారిపై వేగంగా వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను దాటి అవతలి వైపునకు ఎగిరిపడింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం ధాటికి నాలుగు వాహనాలు ధ్వంసమైనట్లు సమాచారం. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టడంతో పాటు ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభించారు. ఒకే రోజు రెండు ఘోర ప్రమాదాల్లో తొమ్మిది మంది ప్రాణాలు కోల్పోవడంతో సంగారెడ్డి జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి.



# మృతుల కుటుంబాలకు సీఎం సంతాపం

## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం

**హైదరాబాద్, ఆగస్టు 12:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోవడం పట్ల విచారం వ్యక్తం చేస్తూ మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని సంబంధిత అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. క్షతగాత్రుల చికిత్స విషయంలో ఎలాంటి లోటు లేకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

# 22ఏ భూములపై ఆందోళన వద్దు



- చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం
- దరఖాస్తుల పరిష్కారం యుద్ధప్రాతిపదికన చేపట్టాలి
- 14లోగా అన్ని పత్రాలు ఆన్‌లైన్‌లోకి
- సబ్ రిజిస్ట్రార్ల విచక్షణాధికారాలకు చెక్
- ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ ప్రసక్తే లేదు
- మంత్రి పొంగులేటి స్పష్టీకరణ

**హైదరాబాద్, ఆగస్టు 11:** నిషేధిత ఆస్తుల జాబితాలో ఉన్న భూముల విషయంలో ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. తమ ప్రభుత్వం కొత్తగా ఎలాంటి భూములను నిషేధిత జాబితాలో చేర్చలేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన, సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కల్పిస్తామని తెలిపారు. సచివాలయంలో మంగళవారం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్--మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లతో నిషేధిత ఆస్తుల జాబితా, 22ఏ సమస్యలపై మంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ప్రజావాణితో పాటు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లు, సబ్ రిజిస్ట్రార్లకు వచ్చిన దరఖాస్తులు, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లేఅవుట్ల అనుమతులు తదితర పత్రాలన్నింటినీ ఈ నెల 14లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను పొంగులేటి ఆదేశించారు. దీనివల్ల నకిలీ పత్రాలకు అడ్డుకట్ట వేయడంతో పాటు రిజిస్ట్రేషన్ సమయంలో ఏది అసలైన పత్రమో, ఏది నకిలీదో గుర్తించేందుకు సబ్ రిజిస్ట్రార్లకు స్పష్టత వస్తుందన్నారు. మరింత పారదర్శకత కోసం పహాణీల వివరాలను కూడా సబ్ రిజిస్ట్రార్లు పరిశీలించే అవకాశం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో వాస్తవాలను గుర్తించి యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లను ఆదేశించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రజల కోణంలో ఆలోచించి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. సమస్య వచ్చిన తర్వాత పరిష్కరించడం కంటే సమస్య తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు. ప్రతి దరఖాస్తును కేసుల వారీగా రోజూ సమీక్షించాలని స్పష్టం చేశారు. 22ఏ పేరుతో ఉద్దేశపూర్వకంగా పేదలు, అర్హులకు అన్యాయం చేస్తే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు. సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని, అదనపు అధికారాలు ఇవ్వొద్దని గతంలోనే స్పష్టత ఇచ్చినట్లు తెలిపారు. ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉన్న వివరాల ఆధారంగా మాత్రమే నిర్ణయాలు తీసుకునేలా వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో మాత్రం ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేశారు. ప్రభుత్వ భూముల విషయంలో చిన్న తప్పు జరిగినా క్షమించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏదైనా సమస్య ఎదురైతే జిల్లా సబ్ రిజిస్ట్రార్లు సంబంధిత కలెక్టర్ లేదా రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. నిషేధిత జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్లను గుడ్డిగా తిరస్కరించవద్దని పొంగులేటి స్పష్టం చేశారు. అవసరమైతే మూడు రోజుల సమయం తీసుకుని, రిజిస్ట్రేషన్ ఎందుకు తిరస్కరించాల్సి వస్తుందో కారణాలను స్పష్టంగా తెలియజేయాలని ఆదేశించారు. ఇకపై నిషేధిత ఆస్తులకు సంబంధించిన ప్రతి దరఖాస్తును తహశీల్దార్‌కు పంపకుండా నేరుగా కలెక్టర్‌కు పంపించాలని సూచించారు. కలెక్టర్, జిల్లా రిజిస్ట్రార్ మధ్యనే సంబంధిత ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలని పేర్కొన్నారు. గతంలో వ్యవసాయ, వ్యవసాయేతర, నిషేధిత ఆస్తుల జాబితాలు వేర్వేరుగా ఉండేవని, వాటిని సమీకరించిన తర్వాత కొన్ని ఆస్తులు నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపించడంతో మొత్తం రిజిస్ట్రేషన్‌ను నిలిపివేస్తున్నారన్న ఫిర్యాదులు వస్తున్నాయని మంత్రి తెలిపారు. తాజాగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో వివరాలను సరిపోల్చుకున్న తర్వాతే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. నాలుగు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ఉన్నతస్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారికి వివరించి తక్షణమే అమలు చేయాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీని ఆదేశించారు. సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, నాలుగు జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.

# రేవంత్ షెల్ కంపెనీల బాగోతం

- త్వరలోనే బండారం బయటపెడతాం
- సీఎం సోదరులంతా కంపెనీ ఓనర్లు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




**హైదరాబాద్, ఆగస్టు 11:** సీఎం రేవంత్‌రెడ్డి సోదరులంతా పెద్ద పెద్ద కంపెనీలకు యజమానులవుతున్నారని భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణభవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. ఒక్క ఉద్యోగి కూడా లేకుండా కొత్తకొత్త కంపెనీలు ఏర్పాటు చేస్తున్నారని విమర్శించారు. సీఎం సోదరులు చిన్నచిన్న ఇంటి అడ్రస్‌లతో పెద్దపెద్ద కంపెనీలు రిజిస్ట్రేషన్ చేయించారు. అలాంటి ఊరుపేరు లేని కంపెనీలకు రాష్ట్రప్రభుత్వం రూ.200 కోట్ల విలువైన 5 ఎకరాల భూమి కేటాయించింది. అనుముల కొండల్‌రెడ్డి టెసరాక్ట్ కంపెనీ ఛైర్మన్ అని లింక్‌డిన్ ప్రొఫైల్‌లో పెట్టుకున్నారు. సీఎం మరో సోదరుడు జగదీశ్‌రెడ్డి కాంట్రాక్టులు చేసుకుంటున్నారు. సీఎం బామ్మర్ది సృజన్‌రెడ్డికి సింగరేణిలో కాంట్రాక్టు ఇచ్చారని కేటీఆర్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రేవంత్ షెల్ కంపెనీల బాగోతాన్ని బయటపెడతామని హెచ్చరించారు. అనుముల కొండల్‌రెడ్డి టెస్రాక్ట్ సంస్థకు ఛైర్మన్‌గా ఉన్నానని ఆయనే చెప్పారని అన్నారు. రేవంత్ బ్రదర్స్ సూటు బూట్లతో కంపెనీలు ఎలా పెట్టారని ప్రశ్నించారు. టెస్రాక్ట్ కంపెనీలో ఒక్క ఎంప్లాయీ కూడా లేరని.. లక్ష రూపాయలతో ఆ కంపెనీ పెట్టడం ఎలా సాధ్యమని నిలదీశారు. ఆ కంపెనీకి వేల కోట్ల భూములు ఎలా కేటాయించారని ప్రశ్నించారు. రూ.2వేల కోట్ల విలువ చేసే స్థలాన్ని రూ.7 వేల కోట్లకు కేటాయించారని ప్రస్తావించారు. ఆ కంపెనీకి కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్ బాబు ఎలా చెబుతారని నిలదీశారు. శ్రీధర్‌బాబుకి తన శాఖలో ఏం జరుగుతుందో తెలియదా.? లేక సీఎం వత్తిడికి తలొగ్గరా అని ప్రశ్నల వర్షం కురిపించారు. కర్ణాటకలో అక్కడి ప్రభుత్వం సీఎం భార్యకు మూడెఎకరాలు కేటాయించడంపై కేసు నమోదైందని తెలిపారు. ముడా స్కాంలో సిద్ధరామయ్య రాజీనామా చేయాల్సిన పరిస్థితి వచ్చిందని అన్నారు. అనుముల కొండల రెడ్డి టెస్రాక్ట్ సంస్థకి ఛైర్మన్‌గా ఆయనే పేర్కొన్నారు. కొండల్‌రెడ్డికి సంబంధం లేకుంటే యూఎస్ కౌన్సిల్ మీటింగ్‌కి ఎలా వెళ్లారని నిలదీశారు. ఈ భూ కేటాయింపులను వదలబోమని వార్నింగ్ ఇచ్చారు. తిరుపతిరెడ్డి ఏ హోదాలో అధికారిక సమావేశాలకు వెళ్తారని ప్రశ్నించారు. ప్రజలకు పట్టాలు ఏ హోదాలో ఇస్తారని నిలదీశారు. రాష్ట్ర గవర్నర్‌నీ కలిసి ఈ విషయంపై విచారణ జరపాలని కోరతామని అన్నారు. 74 లక్షల ఓట్లు తొలగిస్తారనేది ఆందోళనకరమైన విషయమని చెప్పుకొచ్చారు. ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల తర్వాత పార్టీ నేతలు న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. అర్హుల ఓట్లు కోల్పోకుండా చూస్తామని అన్నారు. తెలంగాణకు అన్యాయం చేసే జీఆర్ఎంబీ మీటింగ్‌కు రాష్ట్ర ప్రభుత్వం వెళ్తుందా లేదా స్పష్టం చేయాలన్నారు. జలసౌదాలో జరిగే జీఆర్ఎంబీ అజెండా మార్చుకుంటే జలసౌధను ముట్టడిస్తామని తెలిపారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్‌కి జాతీయ హోదా ఇవ్వలేమని కేంద్ర చెప్పినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. వరుణ యాగం చేయడం తప్పు కాదు కానీ ప్రభుత్వం చేయాల్సిన పని చేయాలని కేటీఆర్ పేర్కొన్నారు.

# 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

- 15న సంగారెడ్డి నుంచి రేషన్ కార్డుల పంపిణీ
- సీఎం చేతుల మీదుగా లాంఛనంగా ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా ఏకకాలంలో కార్యక్రమాలు
- ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల సన్నబియ్యం
- ఏర్పాట్లలో ఎక్కడా లోటు ఉండొద్దు
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి




**హైదరాబాద్, ఆగస్టు 11:** తెలంగాణలో ఆహార భద్రతకు ఇక 'స్మార్ట్' రూపం రానుంది. రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్ధిదారులకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించనుండగా, అదే రోజు రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లపై మంగళవారం పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో మాట్లాడి ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగ సభ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది లబ్ధిదారులు ఆహార భద్రత పరిధిలో ఉన్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతి అర్హుడైన లబ్ధిదారుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ప్రవేశంతో ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం పెరగడంతో పాటు లబ్ధిదారులకు మరింత సౌలభ్యం కలుగుతుందని చెప్పారు. 2025 జనవరి 26 నుంచి ఇప్పటివరకు కొత్తగా 16,32,810 ఆహార భద్రత కార్డులను జారీ చేసినట్లు మంత్రి వెల్లడించారు. వీటి ద్వారా 61,08,544 మందిని ఆహార భద్రత పరిధిలోకి తీసుకొచ్చినట్లు చెప్పారు. ఆగస్టు 2026 నాటికి రాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1.06 కోట్లకు చేరిందన్నారు. రాష్ట్రంలో ఆహార భద్రత కార్యక్రమానికి ప్రభుత్వం భారీగా నిధులు వెచ్చిస్తోందని ఉత్తమ్ తెలిపారు. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు ఖర్చు చేస్తుండగా, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేల కోట్ల వరకు వెచ్చిస్తున్నట్లు వివరించారు. ఇంత భారీ సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్ధిదారుల చెంతకు తీసుకెళ్లడమే స్మార్ట్ రేషన్ కార్డుల ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆగస్టు 15న సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. లబ్ధిదారుల తరలింపు, సీటింగ్, భద్రత, కార్డుల పంపిణీతో పాటు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే పకడ్బందీగా ప్రణాళిక చేయాలని సూచించారు. కార్యక్రమానికి సంబంధించి నిమిషాల వారీ షెడ్యూల్‌ను సిద్ధం చేసి నిర్దేశిత సమయంలో కార్యక్రమం పూర్తయ్యేలా చూడాలన్నారు. సమాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే వాస్తవ లబ్ధిదారులను గుర్తించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలని చెప్పారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా జరిగే పంపిణీలో లబ్ధిదారుల గుర్తింపును ధ్రువీకరించి, పూర్తి పారదర్శకతతో కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన జిల్లాల్లో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు పంపాలని, అవసరమైన వ్యయంపై ముందుగానే స్పష్టత ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు. రాష్ట్రంలో అమలవుతున్న ఆహార భద్రత కార్యక్రమం విస్తృతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. 1.06 కోట్ల ఆహార భద్రత కార్డులు, 3.43 కోట్ల మంది లబ్ధిదారులు, ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల ఉచిత సన్నబియ్యం వంటి కీలక అంశాలపై విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు. ఆగస్టు 15 నాటికి అన్ని ఏర్పాట్లను పూర్తి చేసి సంగారెడ్డి రాష్ట్రస్థాయి కార్యక్రమంతో పాటు 33 జిల్లాల్లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని క్రమశిక్షణతో, పారదర్శకంగా నిర్వహించాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు.



# 'చేయూత' కొత్త పింఛన్లకు దరఖాస్తులు

## ఆగస్టు 31 వరకు దరఖాస్తుల స్వీకరణ

## అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు లేదు

**హైదరాబాద్, ఆగస్ట్ 11:** అర్హులైన పేదలు, బలహీన వర్గాలకు సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా చేయూత సామాజిక భద్రత పింఛన్ పథకం కింద కొత్త పింఛన్ల మంజూరుకు తెలంగాణ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తొలిదశలో ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ వ్యాధి, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న వారికి కొత్త పింఛన్లు మంజూరు చేయనున్నారు. కొత్త పింఛన్ల కోసం అర్హత ప్రమాణాల్లో ఎలాంటి మార్పు చేయలేదు. గత ప్రభుత్వాల హయాంలో జారీ చేసిన ప్రభుత్వ ఉత్తర్వుల్లో పేర్కొన్న ఎలిజిబిలిటీ క్రైటీరియానే ప్రస్తుత ప్రభుత్వం కూడా ప్రామాణికంగా తీసుకుంటోంది. 2014 నుంచి 2018 మధ్య జారీ చేసిన సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వుల్లోని నిబంధనల ప్రకారమే అర్హతను పరిశీలిస్తారు. ప్రజాపాలన వారోత్సవాలు, 99 రోజుల ప్రగతి ప్రణాళిక గ్రామసభలు, ప్రజావాణిలో ఇప్పటికే అందిన దరఖాస్తులను కూడా పరిగణనలోకి తీసుకుంటారు. గతంలో దరఖాస్తు చేసి, అవసరమైన అన్ని పత్రాలు సమర్పించిన వారు మళ్లీ దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. అవసరమైన పత్రాలు సమర్పించని వారు లేదా ఇప్పటి వరకు దరఖాస్తు చేయని అర్హులు కొత్తగా దరఖాస్తు చేసుకోవచ్చు. అర్హత నిర్ధారణ కోసం సంబంధిత శాఖల నుంచి అవసరమైన ధ్రువపత్రాలను పొందేలా జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకుంటారు. వితంతువులకు భర్త మరణ ధ్రువపత్రం, ఒంటరి మహిళలకు సెపరేషన్ లేదా స్థానిక విచారణ నివేదిక, గీత కార్మికులకు ఎక్సైజ్ శాఖ ధ్రువీకరణ, చేనేత కార్మికులకు చేనేత–జౌళి శాఖ ధ్రువీకరణ, ఫైలేరియా బాధితులకు వైద్య ఆరోగ్య శాఖ ధ్రువీకరణ అవసరం. దరఖాస్తుల పరిశీలన అనంతరం నిర్దేశిత అధికారులు క్షేత్రస్థాయిలో అర్హతను తనిఖీ చేస్తారు. ఆ తర్వాత అర్హుల జాబితాను జిల్లా స్థాయికి పంపి, జిల్లా కలెక్టర్ ఆమోదంతో పింఛన్ మంజూరు ప్రక్రియ పూర్తి చేస్తారు. ప్రతి అర్హుడికి చేయూత అందించాలనే ఉద్దేశంతో స్వయం సహాయక సంఘాల సమాఖ్యలకు కూడా బాధ్యతలు అప్పగించారు. ముఖ్యంగా ప్రతి అర్హత కలిగిన వితంతువు, ఒంటరి మహిళకు దరఖాస్తు చేసుకోవడం, అవసరమైన ధ్రువపత్రాలు పొందడంలో సహకరించాలని సూచించారు. కొత్త పింఛన్ల కోసం దరఖాస్తులను ఆగస్టు 31 వరకు స్వీకరిస్తారు. దరఖాస్తులతో పాటు వివరాలను చేయూత పోర్టల్‌లో నమోదు చేసే ప్రక్రియను కూడా వెంటనే చేపట్టనున్నారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందేలా పారదర్శకంగా, నిబంధనల ప్రకారం ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. అర్హులైన వారికి సామాజిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రక్రియను వేగవంతం చేసింది.


# యూపీఐ పేమెంట్స్‌పై ఛార్జీలు ఒడవు

## కమ్యూనిస్టులు అబద్దాల ప్రచారం తగదన్న నిర్మల

**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:** రూపే, గూగుల్‌పే, ఫోన్‌పే వంటి యూన్ఫి÷డ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ)ల ద్వారా జరిపే లావాదేవీలకు ఛార్జీలు వసూలు చేస్తారన్న అనుమానాలపై ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తోసిపుచ్చారు. ముఖ్యంగా కమ్యూనిస్టులు ఇలాంటివి ప్రచారం చేయడంలో ముందుంటారని ఎద్దేవా చేశారు. వీటిని ఉపయోగించే వినియోగదారుల నుంచి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయబోరని పేర్కొన్నారు. కొన్ని రకాల లావాదేవీలకు మాత్రర భవిష్యత్తులో మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) వసూలు చేసే అవకాశం ఉందని తెలిపారు. దీనిని ఇంకా ఖరారు చేయలేదని, తరువాత నోటిఫికేషన్ ఇస్తామని చెప్పారు. ఛార్జీలు వసూలు చేసేందుకు వీలు కలిగేంచేలా చట్టాన్ని సవరించామే తప్ప, వినియోగదారుల నుంచి ఇప్పటికిప్పుడు వసూలు చేయడానికి కాదని చెప్పారు. ఏ వస్తువుపై ఎండీఆర్ వసూలు చేయాలి, ఎంత ధరకు పరిమితం చేయాలన్న దాన్ని తరువాత నిర్ణయిస్తామని తెలిపారు. యూపీఐ విధానాన్ని 2016లో ప్రారంభించగా, అప్పటి నుంచి ఉచితంగా సేవలు అందిస్తున్నట్టు చెప్పారు. అది కొనసాగుతుందని తెలిపారు. చిరు వ్యాపారులపై భారం పడబోదన్నారు. అమెరికా ఒత్తిడి మేరకే యూపీఐ చెల్లింపులపై రుసుములు వసూలు చేయాలని నిర్ణయించారని సీపీఎం సభ్యుడు జాన్ బ్రిట్టాస్ ఆరోపించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ 'కమ్యూనిస్టులే అంత... వాస్తవాలు చెప్పరు. ఆపై వక్రీకరణలు' అని వ్యాఖ్యానించారు. సమాధానం వినే ధైర్యం లేని పిరికిపందలని విమర్శించారు.

# సగర్వంగా హర్ ఘర్ తిరంగా

## ఇన్‌స్టా వేదికగా ప్రధాని మోడీ పోస్ట్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీమంగళవారం ఓ వీడియో పోస్టు చేశారు. ఆగస్టు 15న జెండా పండుగను ప్రజలంతా సగర్వంగా నిర్వహించుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు. దేశ ప్రజలంతా 'హర్ ఘర్ త్రివర్ణ' ప్రచారంలో చురుకుగా పాల్గొనాలని కోరారు. స్వాతంత్ర్య సమరయోధులకు ఘనంగా నివాళు లర్పించాలని మోదీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ.. 'ఆగస్టు 15ని గర్వంగా జరుపుకోండి, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులు అర్పించండి, వికసిత్ భారత్ కోసం ప్రతిజ్ఞ చేయండి. హర్ ఘర్ తిరంగా, ఘర్ ఘర్ తిరంగా, హర్ మన్ తిరంగా' అని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రతి ఇంటిలోనూ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేయాలని మోదీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాన్ని ఓ వేడుకలా నిర్వహించాలని కోరారు. త్రివర్ణ పతాకం మనకు గర్వకారణమని, దేశం కోసం ఎల్లప్పుడూ సేవలందించేందుకు అది నిరంతరం స్ఫూర్తినిస్తుందని ప్రధాని చెప్పుకొచ్చారు. ఈసారి హర్ ఘర్ తిరంగా ఉద్యమంలో ఉత్సాహంగా పాల్గొని, భారత్ నిర్మాణానికి దోహదపడాలని ఆకాంక్షించారు. అలాగే, ఈ ఏడాది వందేమాతరం జాతీయ గీతం ఇతివృత్తంగా వేడుకలు నిర్వహించనున్నట్లు మోదీ పేర్కొన్నారు.

ఉద్యమ కెరటం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
బుధవారం
12 ఆగస్టు 2026

## సంపాదకీయం



# ఎవరి కోసం వీరి ఆందోళనలు?

పార్లమెంట్ సమావేశాలు ఆందోళనలో కొనసాగడం లేదు. విపక్షాలు వెల్‌లోకి దూసుకుని రావడం..ప్లకార్డులు ప్రదర్శించడం..వాయిదా పడడం షరామామూలుగా మారింది. ప్రజలు ఎన్నుకున్న ప్రజాప్రతినిధులు తమ ఆందోళనలతో ప్రజలను అవమానపరుస్తున్నారు. వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించకుండా తాము పట్టిన కుందేటికి మూడేకాళ్లు అన్న చందంగా అమిత్ షా క్షమాపణలు చెప్పలని అనడమో లేదా, ప్రధాని క్షమాపణలు చెప్పాల్సిందేనన్న డిమాండ్‌తో ఆందోళన చేస్తున్నారు. మంగళవారం కూడా లోక్‌సభ ప్రారంభం కాగానే ఇదే తరహా డ్రామా నడిచింది. పార్లమెంట్‌కు ఎన్నికైనవారు తాము ప్రజలకు జవాబుదారీ అన్నది మరిచి పోతున్నారు. నీట్ పేపర్ లీక్‌కు నిరసనగా విద్యార్థులు గత నెలలో చేపట్టిన చలో పార్లమెంటు ర్యాలీపై పోలీసుల బలప్రయోగంతో దిల్లీ రణరంగమైన ఉదంతాన్ని ఆసారా చేసుకుని అదేపనిగా పార్లమెంటులో గందరగోళం చేస్తున్నారు. సభ వాయిదా పడగానే బయటకు వచ్చి ఆందోళన చేస్తున్నారు. తాజాగా మంగళవారం అధికార ఎన్‌డిఎ ఎంపిలు కూడా విపక్షాల తీరును నిరసిస్తూ ఆందోళనకు దిగారు. వారు కూడా విపక్షాల తీరుపై ప్లకార్డులు ప్రదర్శించారు. ఇలా పోటాపోటీగా సభలో చర్చలు సాగాలి. కానీ సభను స్తంభింపచేయడమే పనిగా పెట్టుకుంటే ప్రజలు ఏం కావాలి. జార్ఖండ్‌లో కూడా ఢిల్లీ జంతర్‌మంతర్ ఘటననే రిపీట్ అయ్యింది. దీనిపై ఎవ్వరూ మాట్లాడడం లేదు. జంతర్‌మంతర్ ఘటన మరువకముందే.. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో సోమవారం అలాంటి పరిణామం చోటుచేసుకుంది. ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలను నిరసిస్తూ అసెంబ్లీని ముట్టడించేందుకు ఝార్ఖండ్ విద్యార్థులు, ఉద్యోగార్థులు చేపట్టిన ర్యాలీ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. వారిని నిలువరించేందుకు పోలీసులు జల ఫిరంగులను ప్రయోగించారు. లాఠీఛార్జి కూడా చేశారు. దీంతో అనేక మంది గాయపడ్డారు. వారిలో పలువురు విద్యార్థినులూ ఉన్నారు. కాంగ్రెస్ భాగస్వామిగా ఉన్న ఝార్ఖండ్ ముక్తిమోర్చా (జేఎంఎం) నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉద్యోగ నియామకాల్లో అక్రమాలపై విద్యార్థులు, ఉద్యోగార్థులు 17 రోజులుగా ఆందోళన చేస్తున్నారు. కానీ వారిని ఏనాడు రాహుల్, ప్రియాంకలు వెళ్లి పరామర్శించలేదు. ఇండియా కూటమి నేతలు ఎవ్వరూ జార్ఖండ్ గురించి మాట్లాడం లేదు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీక్‌ను నిరసిస్తూ రాంచీలో అసెంబ్లీని ముట్టడించేందుకు వారు సోమవారం వేలాదిగా తరలివచ్చారు. పటిష్ఠ భద్రతా ఏర్పాట్లను దాటుకుంటూ.. శాసనసభకు దాదాపు 200 మీటర్ల దూరం వరకు దూసుకొచ్చారు. వారిని నియంత్రించేందుకు పోలీసులు బాష్పవాయు గోళాలు, జలఫిరంగులు ప్రయోగించారు. లాఠీఛార్జి చేశారు. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలకు వ్యతిరేకంగా 9 రోజులుగా నిరాహార దీక్ష చేస్తున్న జేఎల్‌కేఎం నేత దేవేంద్రనాథ్ మహతో.. అంబులెన్సులో ఉండి అసెంబ్లీ ముట్టడి ర్యాలీలో పాల్గొన్నారు. ఆయన ఝార్ఖండ్ మాజీ సీఎం శిబూ సోరెన్ చిత్రపటాన్ని చేతిలో పట్టుకొని కనిపించారు. తమ గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్న రాష్ట్ర ప్రభుత్వంతో ప్రస్తుతం చర్చలు జరపబోమని మహతో స్పష్టం చేశారు. ర్యాలీ అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితి క్షీణించడంతో ఆసుపత్రిలో చేర్పించారు. ఉద్రిక్తతల కారణంగా అసెంబ్లీ మధ్యాహ్నమే వాయిదా పడింది. నిజంగానే సమస్యలపై చిత్తశుద్ది ఉంటే అసెంబ్లీలో హేమంత్ సోరెన్ ప్రకటన చేయాలి. ప్రకటన చేసేలా ఇండియా కూటమి నేతలు రాయబారం నడపాలి. ఢిల్లీ జంతర్‌మంతర్ ఎలాగో ఇక్కడా అలాగే పోలీసులు వ్యవహరించారు. శాంతిభద్రతలు మాకేంటని వారు మిన్నకుంటే అసెంబ్లీ వైపు ఆందోళనకారులు దూసుకుని వచ్చేవారు. లాఠీఛార్జ్ చేయవద్దని లేదా చేయాలని పోలీసులకు ఎవ్వరూ చెప్పరు. తమ విధులను నిర్వహించే పోలీసులను తప్పు పట్టడానికి లేదు. ఇకపోతే ఉద్యోగ నియామక పరీక్షల్లో అక్రమాలకు సంబంధించి.. ఝార్ఖండ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (జేపీఎస్సీ) మాజీ ఛైర్‌పర్సన్ ఎల్ ఖియాంగ్తేను రాష్ట్ర సీఐడీ సోమవారం అరెస్టు చేసింది. ఈయన 1988 బ్యాచ్ ఐఏఎస్ అధికారి. జేపీఎస్సీ ఛైర్‌పర్సన్‌గా నిరుడు ఫిబ్రవరిలో నియమితులయ్యారు. గత నెల 22న ఆ పదవికి రాజీనామా చేశారు. జేపీఎస్సీలోని మొత్తం ముగ్గురు సభ్యులూ అజీతా భట్టాచార్య, ఎనీమా హన్స్‌దా, జమాల్ అహ్మద్ తమ పదవులకు ఆదివారమే రాజీనామా చేశారు. ఝార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (జేఎస్ఎస్‌సీ) సీజీఎల్ పరీక్షలో అవకతవకలకు సంబంధించి సీఐడీ నమోదు చేసిన ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) తాజాగా రంగంలోకి దిగింది. ఈ వ్యవహారంలో నగదు అక్రమ చలామణి చట్టం (పీఎంఎల్‌ఏ) కింద దర్యాప్తు ప్రారంభించింది. ఉద్యోగ పరీక్షల్లో అవకతవకలపై సీబీఐతో దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇదే డిమాండ్‌తో ఝార్ఖండ్ సీఎం హేమంత్ సోరెన్ నివాసం ఎదుట భాజపా నేతలు సోమవారం ధర్నా చేశారు. దిల్లీలో ఆందోళనలను సమర్థించిన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ... ఝార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనను ఎందుకు పట్టించుకోవటం లేదని భాజపా నిలదీసింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగానికి నిరసనగా మంగళవారం రాష్ట్ర బంద్ పాటించాలని పిలుపునిచ్చింది. మొత్తానికి ఢిల్లీ, రాంచీ ఆందోళనలను పట్టించుకోవాలి. యువత జీవితాలను దెబ్బతీస్తున్న లీక్ వీరులను ఉరితీయాలి. గల్ఫ్ దేశాల్లో ఉన్న ఉరితీత శిక్షలు మనదగ్గరా అమలు చేస్తే తప్ప వ్యవస్థ చక్కబడదు. ఇదంతా ఒక ఎత్తయితే సమస్యలను చర్చించాల్సిన పార్లమెంట్‌లో గందరగోళం సృష్టించి సభను నడవకుండా చేయడం ద్వారా విపక్షాలు ప్రజలను అవమానిస్తున్నాయి. ఇది ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు.

# కొలంబియాను కుదిపేసిన భూకంపం

- 7.4 తీవ్రతతో పెను ప్రకంపనలు
- 132కు చేరిన మృతుల సంఖ్య..
- 570 మందికి గాయాలు
- శిథిలాల కింద చిక్కుకున్న వారి కోసం గాలింపు
- పలు నగరాల్లో భవనాలు నేలమట్టం..
- విమాన సేవలకు అంతరాయం
- సహాయక చర్యల్లో సైన్యం..
- విదేశాల నుంచి సాయం




**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:** కొలంబియాలో భారీ భూకంపం పెను విషాదాన్ని మిగిల్చింది. సోమవారం పశ్చిమ కొలంబియాలో 7.4 తీవ్రతతో ఏర్పడిన భూకంపం ధాటికి మరణించిన వారి సంఖ్య 132కు చేరింది. మరో 570 మంది గాయపడ్డారు. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక బృందాలు ముమ్మరంగా గాలిస్తున్నాయి. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. భూకంప కేంద్రం చోకో ప్రాంతంలోని శాన్ జోసె డెల్ పాల్మార్ సమీపంలో ఉన్నట్టు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. భూకంపం సుమారు 107 కిలోమీటర్ల లోతులో సంభవించింది. దీని ప్రకంపనలు కొలంబియాలోని కాలీ, పెరీరా, మానిజాలెస్, బొగోటా తదితర ప్రాంతాలతోపాటు పొరుగు దేశాల్లోనూ నమోదయ్యాయి. భూకంప ధాటికి అనేక ప్రాంతాల్లో భవనాలు కుప్పకూలాయి. కాలీలోని ఓ ఆసుపత్రిలో పీడియాట్రిక్, నియోనేటల్ విభాగాలు దెబ్బతిన్నాయి. శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని రక్షణ సిబ్బంది వెలికితీశారు. ఆసుపత్రుల్లోని కొంతమంది రోగులను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. కాలీలోనే 30 శాతం వరకు ఆసుపత్రి నిర్మాణం దెబ్బతిన్నట్టు స్థానిక అధికారులు తెలిపారు. పెరీరా, కాలీ నగరాల్లో భవనాల కూలిపోవడంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. మానిజాలెస్‌లోని చారిత్రక కేథడ్రల్ టవర్ ఒకటి కూలిపోయింది. పలు ఇళ్లు, ఆరోగ్య కేంద్రాలు, పాఠశాలలు కూడా దెబ్బతిన్నాయి. భూకంప తీవ్రత దృష్ట్యా కొలంబియా ప్రభుత్వం జాతీయ విపత్తుగా ప్రకటించింది. సహాయక చర్యలను వేగవంతం చేసేందుకు సైనిక బలగాలను రంగంలోకి దించింది. శిథిలాల కింద చిక్కుకున్న వారిని సజీవంగా బయటకు తీసుకురావడమే తమ తొలి ప్రాధాన్యమని అధ్యక్షుడు అబెలార్డో డి లా ఎస్ప్రియెల్లా తెలిపారు. సైన్యం ప్రత్యేక శిక్షణ పొందిన రెస్క్యూ సిబ్బంది, శిథిలాల్లో చిక్కుకున్న వారిని గుర్తించే పరికరాలు, శునక దళాలను రంగంలోకి దించింది. రిమోట్ ప్రాంతాల్లో రహదారులు, సమాచార వ్యవస్థలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. భూకంపం కారణంగా పశ్చిమ కొలంబియాలోని పలు విమానాశ్రయాల్లో కార్యకలాపాలు నిలిచిపోయాయి. పెరీరా, మానిజాలెస్, ఆర్మేనియా, కార్టాగో, బ్యూనవెంచురా తదితర విమానాశ్రయాల్లో తనిఖీలు కొనసాగుతున్నాయి. కొన్ని చోట్ల వైద్య, ప్రభుత్వ విమానాలకు మాత్రమే అనుమతి ఇస్తున్నారు. మరోవైపు కొలంబియాకు సాయం చేసేందుకు పలు దేశాలు ముందుకొచ్చాయి. ఈక్వెడార్ 47 మంది రెస్క్యూ సిబ్బంది, శిక్షణ పొందిన శునకాలు, ప్రత్యేక పరికరాలను పంపేందుకు సిద్ధమైంది. ఎల్ సాల్వడార్, మెక్సికోతోపాటు అమెరికా కూడా అవసరమైన సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నట్టు ప్రకటించింది.

# పార్లమెంటులో అదే ప్రతిష్టంభన

- లోక్‌సభలో విపక్ష ఎంపీల ఆందోళన
- సభను వాయిదా వేసిన స్పీకర్ ఓం బిర్లా
- పార్లమెంట్ ఆవరణలో అధికార, విపక్ష ఎంపీల పరస్పర నినాదాలు






**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:** పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి దశలో అధికార, విపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. లోక్‌సభలో మంగళవారం మళ్లీ గందరగోళం చెలరేగింది. చర్చలో పాల్గొనాలని, సభను సజావుగా నడిపేలా సహకరించాలని విపక్ష సభ్యులకు పదేపదే స్పీకర్ ఓం బిర్లా విన్నవించారు. అయితే విపక్ష సభ్యులు పోడియంలోకి దూసుకుని వచ్చి తమ ఆందోళనలను కొనసాగించారు. మరోవైపు లోక్‌సభలో చర్చలు జరుగుతుండగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రతిపక్ష సభ్యులు ప్లకార్డులు ప్రదర్శించడంతో స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహం వ్యక్తం చేశారు. అర్థవంతమైన చర్చలు జరపాలని హితవు పలికారు. దీంతో స్పీకర్ తొలుత సభను మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేశారు. ప్రతిపక్షాల నినాదాల మధ్య సభ నేటికి వాయిదా పడింది. మంగళవారం పార్లమెంట్ ద్వారం వద్ద విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలంటూ విపక్ష ఎంపీలు నినాదాలు చేశారు. విద్యార్థుల ఆందోళనపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం హామీ ఇచ్చారు. విద్యార్థుల ఆందోళనపై జరిగే చర్చకు హోం మంత్రి అమిత్ షా సమాధానమిస్తారని, అయితే ప్రతిపక్షాలు ప్రభుత్వ సమాధానాన్ని శాంతియుతంగా వినవలసి ఉంటుందని రిజిజు అన్నారు. కాగా, జార్ఖండ్‌లో ఉద్యోగార్థులపై పోలీసుల చర్య, అయోధ్య రామమందిర విరాళాల అపహరణకు నిరసనగా అధికార, విపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. పార్లమెంట్ ప్రధాన ద్వారం వద్ద ఎన్డీయే, విపక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలపై చర్చ నుంచి కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పారిపోతున్నారని ఎన్డీయే ఎంపీలు ఆరోపించారు . ఢిల్లీలో జులై 20న జరిగిన నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించాలని విపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు. కాగా, విపక్షాల ఆందోళనల నేపథ్యంలో సభను బుధవారానికి వాయిదా వేశారు. అధికార, విపక్షాల నిరసనలతో పార్లమెంట్ ప్రాంగణంలో కొంతసేపు గందరగోళం నెలకొంది. ఇరువర్గాల పోటాపోటీ నిరసనలతో పార్లమెంట్ ఆవరణలో గందరగోళం నెలకొంది. వర్షాకాల సమావేశాలు మొదలైనప్పటి నుంచి పార్లమెంట్‌లో వాయిదాల పర్వం కొనసాగుతోంది. సమావేశాలు తుదిదశకు చేరుకుంటుండటంతో.. అధికార విపక్షాల మధ్య రాజకీయ పంతం మరింత పెరిగింది. జంతర్‌మంతర్ వద్ద విద్యార్థుల ఆందోళనలు, పోలీసు చర్యపై విపక్షాలు కోరినట్లుగా... హోంమంత్రి అమిత్‌షా సభలో సమాధానం ఇవ్వటానికి సిద్ధమని కేంద్రం సోమవారం ప్రకటించగా... ఊరికే ప్రసంగాలు కాదు... మేం అడిగిన ప్రశ్నలకే సమాధానం ఇవ్వాలంటూ కాంగ్రెస్ నేత రాహుల్‌గాంధీ మెలిక పెట్టారు.

# అమిత్ షా లోక్‌సభకు రాలేదు

### పిరికి వాడంటూ జైరామ్ రమేశ్ పోస్ట్



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:** విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా వివరణ ఇవ్వాలంటూ ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈ క్రమంలోనే మంగళవారం సైతం లోక్‌సభకు అమిత్ షా రాలేదంటూ కాంగ్రెస్ విమర్శలు ఎక్కుపెట్టింది. గద్దించేవారే పిరికివారని ఆయన మరోసారి నిరూపించినట్లు పార్టీ సీనియర్ నేత జైరాం రమేశ్ 'ఎక్స్' వేదికగా పోస్టు పెట్టారు. వాస్తవాలను పక్కనపెట్టేందుకు ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. అయినప్పటికీ.. కేంద్ర హోం మంత్రి ఈ రోజు కూడా లోక్‌సభకు హాజరు కాలేదు. 17 రోజులుగా లోక్‌సభ, రాజ్యసభలకు ఆయన గైర్హాజరు కావడం అనూహ్యం. ఆయన క్షేమంగానే ఉన్నారా? 1, 2 మధ్య అంతా సవ్యంగానే ఉందా?' అంటూ పరోక్షంగా ప్రధాని మోదీ, అమిత్ షాను ఉద్దేశించి వ్యాఖ్యానించారు. విద్యార్థుల నిరసనలు, పోలీసు చర్యపై లోక్‌సభలో చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఇప్పటికే ప్రకటించారు. ఆ చర్చకు అమిత్ షా సమాధానమిస్తారని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా.. ఇప్పటివరకు లోక్‌సభ 17 రోజులపాటు జరగ్గా 11 బిల్లులను ఆమోదించింది. వాటిలో రెండింటిపైనే చర్చ జరిగింది. ప్రతిపక్షాల ఆందోళనల మధ్య మిగతా బిల్లులన్నీ చర్చ లేకుండానే ఆమోదం పొందాయి.

# దివంగత ప్రధాని మన్మోహన్ ప్రభావశీలి

### కోల్‌స్కామ్‌లో క్లీన్‌చిట్‌పై సోనియా కీలక వ్యాఖ్యలు

### మోడీ ఇకనైనా తనను తాను క్షమించుకోవాలంటూ చురక



**న్యూఢిల్లీ, ఆగస్ట్ 11:** కోల్ స్కామ్ కేసులో దివంగత నేత, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు సుప్రీం కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ మంగళవారం కీలక వ్యాఖ్యలు చేశారు. మాజీ ప్రధాని సింగ్‌ను అత్యంత ప్రభావశీలమైన ప్రధానిగా, మృదుస్వభావిగా చరిత్ర ఎప్పటికీ గుర్తుంచుకుంటుందని వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వంతో పోలిస్తే ఆయన తన నైతికత, జవాబుదారితనంతో పూర్తి భిన్నమైన వ్యక్తిగా కనిపిస్తారని అన్నారు. ఈ తీర్పుతో భారత రాజకీయంలో ఒక విషాదకర ఘట్టానికి ముగింపు పడిందని వ్యాఖ్యానించారు. నీతినిజాయతీ కలిగిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను దోషిగా నిలబెట్టే ప్రయత్నానికి ఫుల్ స్టాప్ పడిందని వ్యాఖ్యానించారు. 'దివంగత నేత మన్మోహన్ సింగ్‌కు వ్యతిరేకంగా ఒక లాబీ పూర్తిసన్నద్ధతతో, సమన్వయంతో పనిచేసింది. అధికార గణం మొదలు న్యాయవ్యవస్థకు చెందిన వారు, పౌర సమాజం, ఆర్ఎస్ఎస్ బీజేపీ అందరూ ఉన్నారు. నాటి ఆరోపణలన్నీ బోగస్ అని నేడు రుజువైంది. డా. మన్మోహన్ సింగ్ నిర్దోషి అన్న విషయం స్పష్టంగా తేలింది' అని ఓ జాతీయ వార్త పత్రికలోని వ్యాసంలో సోనియా గాంధీ రాసుకొచ్చారు. ప్రత్యర్థులను టార్గెట్ చేసేందుకు ఈడీ, సీబీఐ వంటి సంస్థలను మోదీ ప్రభుత్వం దుర్వినియోగపరిచిందని కూడా ఎంపీ సోనియా గాంధీ ఆరోపించారు. 'వాటి లక్ష్యం ప్రత్యర్థులపై ఒత్తిడి తేవడమే. కొందరి గొంతు నొక్కారు. మరికొందరిని బీజేపీలో కలిపేసుకున్నారు. మరికొన్ని అసాధారణ సందర్భాల్లో కొందరికి మంత్రి పదువులు కూడా దక్కాయి' అని సోనియా గాంధీ విమర్శించారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌పై ప్రధాని మోదీ చేసిన కామెంట్స్ దేశ పార్లమెంటు చరిత్రలో అత్యంత దిగజారిన క్షణంగా నిలిచిపోతాయని అన్నారు. ఇటీవల కాలంలో విద్యార్థులను క్షమిస్తున్న ప్రధాని మోదీ ఈ విషయంలో తనని తాను క్షమించుకోవాలని చురకలంటించారు.


# ఆర్టీ సీ బస్టాండ్‌లో ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులను ముమ్మరంగా చేపట్టారు. బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, ఆవరణ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా జెసిబి యంత్రం సహాయంతో బస్టాండ్ పరిసరాల్లో పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించి శుభ్రం చేశారు. పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్వాసన రాకుండా ఉండేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ పారిశుద్ధ్య పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్, డిపో మేనేజర్ రాజశేఖర్ దగ్గరుండి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్లు సుధాకర్, రామయ్యలతో పాటు ఇతర మున్సిపల్ సిబ్బంది, ఆర్టీ సీ అధికారులు పాల్గొన్నారు.

# భాగ్యనగర్ రైలు ప్రయాణికులకు కౌటాల వరకు బస్సు సౌకర్యం కల్పించాలి

**ఎమ్మెల్సీ దండే విఠల్కు కౌటాల మండల నాయకుల వినతి**



**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** కాగజ్నగర్కు వచ్చే భాగ్యనగర్ రైలు ప్రయాణికుల సౌకర్యార్థం కాగజ్నగర్ నుంచి కౌటాల మండల కేంద్రం వరకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని కౌటాల మండల నాయకులు కోరారు. మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ను కలిసి వినతిపత్రం అందజేశారు. కౌటాల మండల కేంద్రంతో పాటు పరిసర గ్రామాల నుంచి అనేక మంది ప్రజలు హైదరాబాద్తో పాటు ఇతర ప్రాంతాలకు రైలు మార్గంలో ప్రయాణిస్తుంటారని తెలిపారు. భాగ్యనగర్ రైలు ద్వారా కాగజ్నగర్కు చేరుకునే ప్రయాణికులు అక్కడి నుంచి కౌటాలకు వెళ్లేందుకు సరైన రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. రైలు ప్రయాణికుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాగజ్నగర్ నుంచి కౌటాల వరకు ప్రత్యేక బస్సు సర్వీసు ఏర్పాటు చేస్తే మండల ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్సీ సంబంధిత ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సు సర్వీసు ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు.

# యూనిఫాంల తయారీని వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ రాజర్షిషా**



**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:**

యూనిఫాంల తయారీని వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా అన్నారు. ఉట్నూర్ మండలంలోని పేర్కగూడ గ్రామంలోగల ఇందిరా మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న పాఠశాల విద్యార్థుల యూనిఫాంల కుట్టు ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అందజేసే యూనిఫాంల కుట్టు పనిని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, నిర్ణీత గడువులోగా వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, నిర్వాహకులను ఆదేశించారు. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు ఇందిరా మహిళా శక్తి కేంద్రాలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు రామారావు, సీసీలు లక్ష్మణ్, కిషన్ రావు, కేంద్రం నిర్వాహకురాలు జ్యోతి, ఇతర దర్జీలు, సిబ్బంది పాల్గొన్నారు.

# మాజీ డీసీసీ అధ్యక్షుడీ పై ఆరోపణలు నిరాధారం

- **ఆసిఫాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్ :** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) మాజీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావుపై చేసిన ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, వాటిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని ఆసిఫాబాద్ మున్సిపల్ కౌన్సిలర్లు స్పష్టం చేశారు. మంగళవారం వారు ఒక ఉమ్మడి పత్రికా ప్రకటనను విడుదల చేశారు. గతంలో డీసీసీ అధ్యక్షురాలు ఆత్రం సుగుణ విలేకరుల సమావేశంలో మాట్లాడిన మాటలను ప్రస్తావిస్తూ, మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందే విశ్వప్రసాద్ రావు ప్రచార రథాలు, సామగ్రి సిద్ధం చేసి పార్టీ విజయం కోసం శాయశక్తులా కృషి చేశారని కౌన్సిలర్లు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ గా గెలిచిన నలుగురు కౌన్సిలర్లను కాంగ్రెస్ పార్టీకి మద్దతుగా నిలపడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, మైనారిటీ వ్యక్తి మున్సిపల్ చైర్మన్ కాకూడదనే ఉద్దేశం ఆయనకు ఉంటే ఈ మద్దతును ఎందుకు కూడగడతారని ప్రశ్నించారు.మరొకవైపు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కు 2, 6, 19 వార్డుల బాధ్యతలు అప్పగించగా, 19వ వార్డులో కాంగ్రెస్ అభ్యర్థి లేకపోవడం వల్ల పరోక్షంగా బీఆర్ఎస్‌కు మేలు జరిగినట్లయిందని, దీనిపై పార్టీ నాయకత్వం వాస్తవాలను పరిశీలించాలని కోరారు. అలాగే మాజీ ఏఎంసి చైర్మన్ మిత్రుడు కౌన్సిలర్ రూ.1.50 కోట్లు ఖర్చు చేసిన చైర్మన్ పదవి దక్కలేదనడం శోచనీయమని, నిజంగా ఆ నిధులు ఖర్చయితే ఎవరు ఇచ్చారు, ఎవరు తీసుకున్నారు, ఎక్కడ లావాదేవీలు జరిగాయో ఆధారాలతో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో ఎవరు పార్టీకి అనుకూలంగా, ఎవరు వ్యతిరేకంగా పనిచేశారో తేలాలంటే నియోజకవర్గ ముఖ్య నేతలు ఆత్రం సుగుణ, అజ్మీరా శ్యామ్ నాయక్, కె. విశ్వప్రసాద్ రావు, ఆత్రం సక్కులతో పాటు గుండా శ్యామ్ దంపతుల ఫోన్ కాల్ డేటాను చట్ట ప్రకారం పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. ఇకనైనా ఒకరిపై ఒకరు నిరాధార ఆరోపణలు చేసుకోవడం మానుకుని, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అందరూ ఐక్యంగా పనిచేయాలని కౌన్సిలర్లు రాపర్తి కార్తిక్, కస్తూరి పుష్పలత, అనుమండ్ల స్వప్న రాణి, కొండు భారతి, ఆత్రం కృష్ణమ్మ, తారాబాయి కోరారు.

# గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ప్రైవేటు అద్దె భవనంలో కొనసాగుతున్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ డిగ్రీ కళాశాలను జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కళాశాలలోని తరగతి గదులు, ప్రయోగశాలలు, లైబ్రరీతో పాటు విద్యార్థుల వసతులను ఆయన నిశితంగా పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న బోధన, మౌలిక సదుపాయాల గురించి కళాశాల అధ్యాపకులు, విద్యార్థులతో నేరుగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు భవనంలో అరకొర వసతుల వల్ల విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ఆయన ప్రత్యేకంగా ఆరా తీశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని రకాల మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అద్దె భవనంలో విద్యార్థులకు ఎలాంటి తాగునీరు, పారిశుధ్యం లేదా ఇతర మౌలిక సమస్యలు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అంతేకాకుండా కళాశాల సొంత భవన నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# మిషన్ భగీరథ కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తున్న ఏజెన్సీలు

**ఏఐటియుసి**



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్:** మిషన్ భగీరథ కాంట్రాక్ట్ కార్మికులను ఏజెన్సీలు శ్రమ దోపిడీకి గురిచేస్తున్నాయని ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ ఆరోపించారు. మంగళవారం ఆసిఫాబాద్ మిషన్ భగీరథ గ్రిడ్ కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కార్మికులు భారీ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రూ 26,000 కనీస వేతనం చెల్లించాలని, ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఈ ఎస్ ఐ, పీ ఎఫ్, బోనస్, ఉద్యోగ భద్రత కల్పించాలని, కొత్తగా తెచ్చిన లొకేషన్ యాప్‌ను వెంటనే రద్దు చేయాలని కోరారు. అనంతరం మిషన్ భగీరథ ఈ ఈ రాకేష్ యూనియన్ నాయకులతో చర్చలు జరిపి, ఈ నెల చివరి నాటికి పెండింగ్ వేతనాలు చెల్లించి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఆత్మకూరి చిరంజీవి, రాజా గౌడ్, షకీర్, బాలేష్, జంషద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధి కి మట్టాదంపతుల ప్రత్యేక శ్రద్ధ

- **రూ.12 లక్షల విలువైన విద్యా సామాగ్రి పంపిణీ**





**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థుల విద్యాభివృద్ధి, సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ విద్యా సామాగ్రి పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం సత్తుపల్లి పట్టణంలోని జేవీఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు విద్యా సామాగ్రిని అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పుస్తకాలు, ఇంటర్మీడియట్ విద్యార్థులకు బ్యాగులు, డిగ్రీ కళాశాల విద్యార్థులకు పుస్తకాలు, కళాశాల యూనిఫామ్లను పంపిణీ చేశారు. అనంతరం డాక్టర్ మట్టా దయానంద్ విద్యార్థులకు ప్రేరణాత్మక మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. విద్యార్థులు భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు చదువుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జీవితంలో మంచి నిర్ణయాలు తీసుకోవడంతో పాటు మంచి నడవడికను అలవర్చుకోవాలని, నిర్దిష్ట లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించే దిశగా క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. ఆషా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సుమారు రూ.12 లక్షల విలువైన సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని కలెక్టర్ దివాకర్ పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడేలా విద్యా సామాగ్రిని అందించడం గొప్ప సేవా కార్యక్రమమన్నారు. సత్తుపల్లి నియోజకవర్గంలో విద్యా వ్యవస్థ అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమంపై ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ దంపతులు చూపిస్తున్న ప్రత్యేక శ్రద్ధ అభినందనీయమని తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి భవిష్యత్తులోనూ ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగించాలని పలువురు ఆకాంక్షించారు.

# ప్రతి కార్యకర్త పార్టీ బలోపేతమే ధ్యేయంగా శ్రమించాలి

- **మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు**
- **టీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం, భారీగా చేరికలు**

**ఉద్యమ కెరటం, నేరడిగొండ(ఇచ్చోడ):** పార్టీ బలోపేతమే లక్ష్యంగా ప్రతి కార్యకర్త కష్టపడి పనిచేయాలని బోథ్ నియోజకవర్గ ఇన్చార్జి, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపూరావు పిలుపునిచ్చారు. ఇచ్చోడ మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ కార్యాలయాన్ని స్థానిక నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పార్టీని క్షేత్రస్థాయి నుంచి మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి నాయకుడు, కార్యకర్తపై ఉందన్నారు. సమన్వయంతో పనిచేస్తూ ప్రజా సమస్యలను నిరంతరం గుర్తించి, వాటి పరిష్కారం కోసం ప్రజల వెంటే ఉండాలని సూచించారు. పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకూ తీసుకెళ్లి ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించాలని కోరారు.

**పార్టీ లో భారీగా చేరికలు..**

కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది యువకులు, నాయకులు, కార్యకర్తలు రాథోడ్ బాపూరావు సమక్షంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి ఆయన సాదరంగా పార్టీ లోకి ఆహ్వానించారు. పెద్ద సంఖ్యలో చేరికలు జరగడం శుభ పరిణామమని, ఇది పార్టీపై ప్రజల్లో ఉన్న ఆదరణకు నిదర్శనమని అన్నారు. కొత్తగా చేరిన వారితో మండలంలో పార్టీ మరింత పటిష్ట మవుతుందనిధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ బిలాల్, మైనార్టీ మండల చైర్మన్ షేక్ ఫరీద్, పలువురు టీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఎల్‌నినో ప్రభావంతో వరి వద్దు ..

- ఆరుతడి పంటలే ముద్దు
- జిల్లా కలెక్టర్ కె. హరిత



**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని జిల్లాలోని రైతులు నీటి వినియోగం తక్కువగా ఉండే ఆరుతడి పంటల సాగుపైనే ఎక్కువ దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కె. హరిత సూచించారు. మంగళవారం కలెక్ట రేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆరుతడి పంటల ప్రాధాన్యతను, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ప్రణాళికను ఆమె వెల్లడించారు. ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. అయితే ఎల్‌నినో ప్రభావం ఈ ఏడాదితో పాటు వచ్చే ఏడాది వరకు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇతర ప్రాంతాలతో పోలిస్తే జిల్లాలో వర్షపాతం మెరుగ్గా ఉన్నప్పటికీ, వరి సాగుకు సరిపడా నీటి లభ్యత ఉండకపో వచ్చని స్పష్టం చేశారు. బోరుబావులు ఉన్న రైతులు సైతం పంట కాలం పూర్తయ్యే వరకు నీరు అందుబాటులో ఉంటుందో లేదో ఆలోచించుకోవాలని కోరారు. రైతుల సంక్షేమాన్ని కాపాడటమే ప్రభుత్వ ధ్యేయమని, ఆరుతడి పంటలు సాగు చేయడం ద్వారా తక్కువ నీటితో అధిక దిగుబడులు మరియు మంచి లాభాలు సాధించవచ్చని పిలుపునిచ్చారు.

### 15 ఆగస్టు నుంచి స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టి న స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఈ నెల 15వ తేదీ నుండి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించనున్నట్లు కలెక్ట ర్ ప్రకటించారు. మండల గ్రామస్థాయిలో కార్డుల పంపిణీ సజావుగా సాగేలా పక్కా ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా లబ్ధి దారులకు మూడు నెలలకు సరిపడా రేషన్ బియ్యం పంపిణీ పూర్తయిందని చెప్పారు. రేషన్ బియ్యం పక్కదారి పట్టకుండా నిఘా ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ హెచ్చరించారు. ఎక్కడైనా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే ప్రజలు వెంటనే అధి కారులకు సమాచారం అందించాలని కోరారు. ఉచిత రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

# అటవీ హక్కుల లబ్ధిదారులకు ప్రభుత్వం పూర్తి అండ

- ప్రతి అర్హుడికి చట్ట ప్రయోజనాలు అందేలా చర్యలు
- జిల్లా కలెక్టర్ రాజర్షి షా

**ఉద్యమ కెరటం, ఆదిలాబాద్:** అటవీ హక్కుల పత్రాలు పొందిన గిరిజనులు, ఇతర అటవీ నివాసుల సమస్యలను పరిష్కరించడంతో పాటు వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పూర్తిస్థాయిలో అందేలా చర్యలు తీసుకుంటు న్నామని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. మంగళవారం ఉట్నూర్లోని కేబీ కాంప్లెక్స్ పీఎంఆర్సీ భవనంలో దొంగచింత, బీర్సాయిపేట్ గ్రామ పంచాయతీల పరిధిలో అటవీ హక్కుల గుర్తింపు చట్టం–2006 అమలుపై పైలెట్ సామాజిక తనిఖీ–ప్రజా వేదిక నిర్వహించారు. సీఏజీ, క్రిస్ప్ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఐటీడీఏ పీఓ మంద మకరంద్ తో కలిసి కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గిరిజన రైతులు సాగులో ఎదురవుతున్న సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలుపై తమ అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ హక్కు పత్రాలు పొందిన రైతులకు పంట రుణాలు, రైతు భరోసా, వ్యవసాయ రాయితీలు, ఇతర సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందుతున్నాయా.. లేదా అనే అంశాలను సామాజిక తనిఖీ ద్వారా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన సమస్యలను పరిష్కరించడమే కార్యక్రమం ఉద్దేశమన్నారు. అటవీ హక్కుల పట్టాదారులు మరణించిన సందర్భాల్లో అర్హులైన వారసుల పేర్లకు హక్కుల పత్రాలను బదిలీ చేసే ప్రక్రియ ప్రారంభమైందని చెప్పారు. అర్హులు ఐటీడీఏ, సంబంధిత తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అటవీ భూముల్లో సాగు చేస్తున్న అర్హులైన రైతులకు ఫర్టిలైజర్ యాప్ ద్వారా ఎరువులు, విత్తనాలు అందేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. కోర్ ఏరియాలో ఇప్పటికే తవ్విన బోరుబా వులను వినియోగంలోకి తీసుకురావడానికి సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు అవసరమైన అనుమతుల విషయంలో అటవీ శాఖతో సమన్వయం చేస్తామని తెలిపారు. వితంతువులు, ఒంటరి మహిళలు, ఇతర అర్హులు ఆధార్, బ్యాంక్ ఖాతా



వివరాలతో గ్రామ పంచాయతీ కార్యదర్శి వద్ద దరఖాస్తు చేసుకుని పెన్షన్ పథకాల ప్రయోజనాలు పొందాలని సూచించారు. ఐటీడీఏ పీఓ మంద మకరంద్ మాట్లాడుతూ అటవీ హక్కుల చట్టం ద్వారా సాగు, నివాస, సామూహిక అటవీ హక్కులు, అటవీ వనరుల వినియోగ హక్కులు కల్పిస్తున్నట్లు వివరించారు. చట్టం అమలు తీరును అంచనా వేయడానికే సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ గంగాధర్, ఆర్డీఓ మోహన్ సింగ్, జిల్లా వ్యవసాయ అధికారి రవీందర్ సింగ్, ఎల్డీఎం ఉత్పల్ కుమార్, ఏపీఓలు వసంత్ రావు, భాస్కర్, కిసాన్ గిరిజనమిత్ర కోఆర్డినేటర్ హర్ష, వివిధ శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

# పట్టా భూమిలో అక్రమంగా మట్టి తీసిన వారిపై చర్యలు తీసుకోవాలి...

### దంపతుల వేడుకోలు

**ఉద్యమ కెరటం, తాండూర్:** మండలంలోని అంకెపల్లి శివారు సర్వే నం.106/F/2 లో ఉన్న తమ పట్టా భూమిలో అక్రమంగా మట్టి తీసిన షేక్ మోహినొద్దీన్ పై అధికారులు వెంటనే శాఖపరమైన చర్యలు తీసుకోవాలని తాండూర్మండలం లింగధరి గూడెం గ్రామానికి చెందిన దుర్గం ఉషారాణి–విజయశంకర్ దంపతులు వేడుకున్నారు. మంగళవారం తాండూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సంవత్సరం మే 25న తంగళ్ళపల్లి గ్రామానికి చెందిన




మొహినొద్దీన్ ట్రాక్టర్ సహాయంతో తన పట్టా భూమిలోని మట్టిని తీసి అతని పొలానికి గట్టుగా వేసుకున్నాడని తెలిపారు. ఈ విషయమై అతన్ని ప్రశ్నించగా, తమను దుర్భాషలాడమే కాక తమకు భూమే లేదని బెదిరించాడని అన్నారు. ఈ విషయమై అదేరోజు తాండూర్ పోలీస్ స్టేషన్లో సైతం ఫిర్యాదు చేశామని, దీనిపై అధికారులు స్పందించలేదని పేర్కొన్నారు . జూన్ 17న తహశీల్దార్ కార్యాలయంలో, జూలై 15న కలెక్టర్ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేసినప్పటికీ తమకు న్యాయం జరగలే దన్నారు. తమ పట్టా భూమిలోని మట్టి తీయడంతో భూమి మొత్తం చెదిరిపోయిందని, పంట వేసుకునే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు విచారణ జరిపి బాధ్యునిపై వెంటనే చర్యలు తీసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

# అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యం

- పిప్పల్కోటిలో పెన్షన్ల దరఖాస్తుల స్వీకరణ

**ఉద్యమ కెరటం, భీంపూర్:** అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని భీంపూర్ మండల సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు దాసరి రమేష్ అన్నారు. మంగళవారం భీంపూర్ మండలం పిప్పల్కోటి గ్రామపం చాయతీలో నిర్వహించిన వితంతువులు, వికలాంగులు, వృద్ధుల నుంచి కొత్త పెన్షన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో అర్హత గల ఏ ఒక్క లబ్ధిదారుడు కూడా పెన్షన్కు దూరం కాకూడనే ఉద్దేశంతో దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహిం చినట్లు తెలిపారు. లబ్ధిదారుల నుంచి స్వీకరించిన దర ఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో ఆన్లైన్ చేయిస్తామని పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతి నిధుల సమన్వయంతో అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి పెన్షన్ అందేలా తనవంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి నాయకత్వాన్ని బలపరుస్తూ భీంపూర్ మండల అభివృద్ధికి నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# గుడిహత్నూర్ కూడలిలో ఆర్టీసీ బస్సుల నిర్లక్ష్యం

- బస్టాండ్లోకి రాని బస్సులు.. ప్రయాణికుల తీవ్ర అవస్థలు
- చర్యలు తీసుకోకుంటే ఆందోళనకు దిగుతాం: సర్పంచ్, గ్రామస్తులు

**ఉద్యమ కెరటం, గుడిహత్నూర్:** మండల కేంద్రంలోని ప్రధాన బస్టాండ్లోకి ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సులు బస్టాండ్లోకి రాకుండా గుడిహత్నూర్ ఎక్స్రోడ్డు నుంచే వెళ్లిపోతుండటంతో నిత్యం రాకపోకలు సాగించే వేలాది మంది ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆడే శీల అధ్యక్షతన మంగళవారం అత్యవసర గ్రామసభ నిర్వహించి సమస్య పరిష్కారానికి ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. మండలంలోని జవహ ర్నగర్ స్టేజీ పరిసరాల్లోని మాచాపూర్, కొలాంగూడ, కొద్దుగూడ, రావుతాండా, ముత్నూర్ తండా, జవహర్నగర్, చెరకువాయి తదితర సుమారు తొమ్మిది గ్రామాల ప్రజలు నిత్యం రవాణా కోసం ఈ మార్గంపై ఆధారపడుతున్నారని తెలిపారు. జవహర్నగర్తో పాటు గుడిహత్నూర్ బస్టాండ్లో ఎక్స్ప్రెస్, ఆర్డినరీ బస్సులు నిలపకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, మహిళలు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఉట్నూర్, ఆసిఫాబాద్, కరీంనగర్, వరంగల్ వైపు వెళ్లే బస్సులు సైతం బస్టాండ్లోకి రాకుండా ఎక్స్రోడ్డు నుంచే వెళ్లిపోతున్నాయని తెలిపారు. దీంతో ఎక్స్రోడ్డు వరకు నడిచి వెళ్లాల్సి రావడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారని గ్రామస్తులు తెలిపారు. అండర్బ్రిడ్జి నిర్మాణ పనులు ఆలస్యం కావడం, రహదారిపై ప్రమాదకర మలుపులు, రోడ్డు దాటేందుకు సరైన ఏర్పాట్లు లేక పోవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుం దోనని ఆందోళన వ్యక్తం చేశారు. అండర్ బ్రిడ్జి పనులు నత్తనడకన సాగుతుండటంతో సమస్య మరింత తీవ్రమైందన్నారు. సమస్య పరిష్కారం కోసం సర్పంచ్ ఆడే శీల, గ్రామ పంచాయతీ పాలకవర్గం జిల్లా కలెక్టర్, ఆర్టీసీ డివిజనల్ మేనేజర్, జిల్లా ఎస్పీ, ఎన్హెచ్ఏఐ అధికారులకు లేఖల ద్వారా ఫిర్యాదు చేశారు. బస్టాండ్ ఎదురుగా ఉన్న డివైడర్ను తొలగించి బస్సులు బస్టాండ్లోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని, జవహర్నగర్ వద్ద బస్స్టేజీ ఏర్పాటు చేసి అక్కడ కూడా బస్సులు నిలిపేలా చూడాలని డిమాండ్ చేశారు. ప్రజల రవాణా సమస్యను వెంటనే పరిష్కరిం చాలని, అండర్బ్రిడ్జి నిర్మాణ పనులను వేగవంతం




చేయాలని కోరారు. అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకోకపోతే గ్రామస్థుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని సర్పంచ్ ఆడే శీల, ఉప సర్పంచ్ నిఖిల్, బీజేపీ నాయకుడు పతంగే బ్రహ్మానంద్, పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్ ముండే తదితరులు హెచ్చరించారు. ఈ సమావేశంలో గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, స్థానికులు పాల్గొన్నారు.

# సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిఒక్కరూ సహకరించాలి



**ఉద్యమ కెరటం, తాండూర్:** తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రతిఒక్కరు సహకరిం చాలని తాండూర్ ఎస్సై కె.ప్రసాద్ రావు అన్నారు. ఈ మధ్యకాలంలో పంట పొలాల్లో ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫార్లను ఎత్తుకెళ్లిన వారిని పట్టుకొని కేసులు నమోదు చేసి జైలుకు పంపించడం జరిగిందని తెలిపారు. అతి తక్కువ ధరకు సోలార్ సిసి కెమెరాలు అందుబాటులో లభిస్తున్న నేపథ్యంలో రైతులు తమ పంట పొలాల్లో వీటిని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఘటనలు జరిగినప్పుడు సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించడం సులువు అవుతుందని తెలిపారు. సీసీ కెమెరాలతో మొబైల్ లో ఎప్పటికప్పుడు వ్యవసాయ క్షేత్రం ప్రదేశాన్ని వీక్షించే అవకాశం ఉంటుందన్నారు. ఇటీవల స్థానిక చెరువుల వద్ద చాప పిల్లలను ఎవరు ఎత్తుకెళ్లకుండా గంగపుత్ర సభ్యులు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం జరిగిందని చెప్పారు. అలాగే ద్వారకపూర్, కాసిపేట పరిసర ప్రాంతాల్లో కూడా కొద్దీ మంది రైతులు వీటిని ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. రైతులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు.

# ఆటో కార్మికుల రాష్ట్రవ్యాప్త సదస్సును విజయవంతం చేయండి



**ఉద్యమ కెరటం, తాండూర్:** ఆటో కార్మికుల జేఏసీ ఆధ్వర్యంలో ఈనెల 13న హైద రాబాద్లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తలపెట్టిన రాష్ట్రవ్యాప్త ఆటో కార్మికుల సదస్సును విజయవంతం చేయాలని తాండూర్ మండల ఆటో యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షులు, మంచిర్యాల జిల్లా భారత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు మహమ్మద్ హబీబ్ పాషా పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రం లోని ఐబీ ఫ్లైఓవర్ వద్ద ఆటో డ్రైవర్లతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు 80 సంవత్సరాల చరిత్రలో ఏ ప్రభుత్వం కూడా ఇంత అన్యాయం చేయలేదని, మార్పు కావలంటూ మా ఓట్లతో గద్దెనెక్కి ఆటో డ్రైవర్స్ ఉన్నారన్న విషయాన్ని మరిచిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆర్థిక ఇబ్బదుల తో సమతమవుతున్న ఆటో కార్మికులకు ములిగే నక్క పై తాటి పండు పడ్డట్టు ఫాస్ట్ మెయిల్ టూ లాస్ట్ మెయిల్ అంటు బస్సు టికెట్ తో పాటు ఇంటి నుంచి గమ్యం వరకు టికెట్టు ఇచ్చి ప్రయాణికులకు ఇంటికి చెర్చే ప్రయత్నాలు కార్పోరేట్ సంస్థకు పట్టం కట్టాడన్ని మేము ఖండిస్తూ ఈ సదస్సు నిర్వహిస్తున్నటట్లు తెలిపారు. ఆటో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని ఆటో కార్మికులు పాల్గొన్నారు.

# అడవి పందిని హతమార్చిన ఐదుగురిపై కేసు




**ఉద్యమ కెరటం, తాండూర్:** అడవి పందిని హతమార్చిన కేసులో ఐదుగురుపై కేసు నమోదు చేసినట్లు బెల్లంపల్లి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సీహెచ్. పూర్ణచందర్, తాండూర్ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కె.గౌరీశంకర్ లు తెలిపారు. వారి తెలిపిన వివరాల ప్రకారం.. తాండూర్ మండలం రేచిని గ్రామంలో గురువారం ఓ ఇంట్లో ముక్క నరేష్, పిడుగు శేఖర్, సబ్బని అంజయ్య, ఒడ్డేపల్లి సంతోష్, మచ్చ రాకేష్ లు అడవి పంది మాంసం పోగులు వేస్తుండగా అటవీ శాఖ అధికారులు పట్టుకోవడం జరిగిం దన్నారు. మచ్చ రాజేష్ పరారీలో ఉండగా, విచారణ నిమిత్తం నలుగురిని బెల్లంపల్లి ఫారెస్ట్ రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు పేర్కొన్నారు. ఈ దాడిలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు టి.గోపికృష్ణ, ఎం.రాజమణి, బి.రాజ్యలక్ష్మి, డ్రైవర్ మల్లిఖార్జున్, అనిమల్ ట్రాకర్ సమ్మయ్య లు పాల్గొన్నారు.

# మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం

**ఉద్యమ కెరటం, కాగజ్నగర్:** వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందని కాగజ్నగర్ పట్టణ 25వ వార్డు కౌన్సిలర్ దుర్గం సూరజ్ అన్నారు. మంగళవారం కాలనీలో మురుగు నీటి కాలువల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీలో మురుగు నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు కాలువల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. ఈ పనులు పూర్తయితే కాలనీలో పారిశుధ్య పరిస్థితులు మెరుగుపడి, ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. వార్డు అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని అన్నారు. వార్డులో నెలకొన్న సమస్యలను దశల వారీగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు పాల్గొన్నారు.



# రోడ్లపైనే మూగజీవాల సంచారం

- ప్రమాదాల అంచున వాహనదారులు
- పట్టించుకోని అధికారులు



**ఉద్యమ కెరటం, కెరమెరి:** కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పగలు, రాత్రి తేడా లేకుండా మూగజీవాలు స్వేచ్ఛగా సంచరిస్తున్నాయి. పశువుల యజమానులు వాటిని రోడ్లపైనే వదిలి వేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై స్థానికులు పలుమార్లు అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**ట్రాఫిక్ ఇబ్బందులు, ప్రమాదాల భయం..**

ముఖ్యంగా రాత్రి వేళల్లో చీకటిలో రోడ్డుపై పశువులు అడ్డుగా నిలబడటంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇరుకైన రోడ్లపై పశువుల గుంపులు చేరడంతో ట్రాఫిక్ జామ్ సమస్యలు ఏర్పడుతున్నాయి. అత్యవసర సేవలందించే అంబులెన్సులు, ఇతర వాహనాలు కూడా పశువుల కారణంగా నిలిచిపోవాల్సిన పరిస్థితి నెలకొంది. పశువులను పెంచుకుంటున్న యజమానులు సరిగ్గా సంరక్షించకుండా, రోడ్లపైకి వదిలేయడంతో ఈ సమస్య తీవ్రమవుతోంది. పశువులు రోడ్లపై తిరుగుతూ ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్నా, యజమానులు పట్టించుకోకపోవడం, ఈ సమస్యపై గ్రామ పంచాయతీ అధికారులకు, పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా, వారు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి, రోడ్లపై తిరుగుతున్న పశువులను గోశాలలకు తరలించాలని, యజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**ప్రమాదాలు జరిగితే బాధ్యులెవరు..?**

పశువుల కారణంగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరిగితే, దానికి బాధ్యులెవరు అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. రోడ్లపై తిరుగుతున్న పశువులను వెంటనే గోశాలలకు తరలించాలని, పశువులను రోడ్లపైకి వదిలేసే యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి తక్షణమే స్పందించాలని కోరుతున్నారు. మండల ప్రజలతో పాటు ప్రయాణికుల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



# భక్తి శ్రద్ధలతో మహంకాళి బోనాలు



**ఉద్యమ కెరటం, గంభీరావుపేట:** మండల కేంద్రంలో అంబేద్కర్ యువజన మాదిగ సంఘం ఆధ్వర్యంలో మహంకాళి బోనాల పండుగను మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు జరిపారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు ఎత్తుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారి ఆశీస్సులు పొందేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి. ఈ సందర్భంగా భక్తులు కుటుంబ సభ్యుల సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నారు. బోనాల సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలతో గంభీరావుపేటలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన మాదిగ సంఘం అధ్యక్షుడు ఇరిగి పరశురాం, ప్రధాన కార్యదర్శి శనిగారపు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు బరుకుటం తిరుపతి, సీనియర్ నాయకులు ఎర్రోళ్ల భీమ్రావు, ఎర్రోళ్ల ప్రభాకర్, ఇరిగి నరసింహులు, ఎర్రోళ్ల శ్రీహరి, ఇరిగి ఎల్లయ్య, ఎర్రోళ్ల బాలరాజు, శనివారం శంకరయ్య, బరుకుటం ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**



**ఉద్యమ కెరటం, మంచిర్యాల:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నస్పూర్లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో డీసీపీ ఎ.భాస్కర్, జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ రాములు తదితరులతో కలిసి అన్ని శాఖల జిల్లా అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 15న సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గౌరవ వందనం, మంచిర్యాల, నస్పూర్ మండలాల తహశీల్దార్ల సంయుక్త ఆధ్వర్యంలో కుర్చీలు, ఇతర ఏర్పాట్లు చేపట్టాలని తెలిపారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో తాగునీరు, పారిశుద్ధ్య నిర్వహణ, జిల్లా పౌర సంబంధాల అధికారి ఆధ్వర్యంలో ముఖ్య అతిథి సందేశం, జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో జాతీయ గీతాలాపన, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ప్రజలు కూర్చునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. పతాకావిష్కరణ, ప్రశంసా పత్రాల పంపిణీ, వేదిక అలంకరణ, పుష్పగుచ్ఛాలు, టెంట్, కుర్చీలు, సౌండ్ సిస్టమ్, మైక్, ప్రోటోకాల్ ప్రకారం ప్రముఖులకు ఆహ్వానాలు తదితర ఏర్పాట్లు పూర్తి చేయాలని పేర్కొన్నారు. వేడుకల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అగ్నిమాపక, వైద్య సేవలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా వేడుకలకు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, మంచిర్యాల ఆర్డీఓ శ్రీనివాసరావు, మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీస్ అధికారులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బేతుపల్లిలో భూ సర్వే ప్రక్రియను పరిశీలించిన కలెక్టర్

- భూ సర్వే సమస్యలను కలెక్టర్ కు వివరించిన సర్పంచ్ దొడ్డ రాజేంద్రప్రసాద్



**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** మండల పరిధిలోని బేతుపల్లి రెవెన్యూ పరిధిలో కొనసాగుతున్న భూ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ దివాకర్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కల్లూరు సబ్కలెక్టర్ అజయ్ యాదవ్తో కలిసి బేతుపల్లి ప్రాంతంలో జరుగుతున్న భూ సర్వే పనులను పరిశీలించి, సంబంధిత అధికారుల ద్వారా వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బేతుపల్లి గ్రామ రైతులు సర్పంచ్ దొడ్డ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో కలెక్టర్ దివాకర్ను కలిసి భూ సర్వే సందర్భంగా ఎదురవుతున్న సమస్యలను వివరించారు. రైతుల సమస్యలను క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం సర్పంచ్ దొడ్డ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలో పైలెట్ ప్రాజెక్టుగా బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని భూములను ఎంపిక చేసి భూ సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భూ సర్వే జరుగుతున్న తీరును క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు వచ్చిన కలెక్టర్కు రైతులతో కలిసి తమ సమస్యలను వివరించినట్లు చెప్పారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా భూ సర్వే ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను కోరినట్లు పేర్కొన్నారు. రైతుల అభ్యంతరాలు, సమస్యలను పరిగణనలోకి తీసుకుని సర్వే ప్రక్రియను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ పున్నం సత్యనారాయణ, సర్వే డీఐ నాగభూషణం, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# కెరమెరి పీహెచ్సీలో అనధికార వ్యక్తి హల్చల్

- వైద్య సిబ్బందిని బెదిరించారంటూ కలెక్టర్కు డాక్టర్ల సంఘం ఫిర్యాదు

**ఉద్యమ కెరటం, కెరమెరి:** కెరమెరి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్సీ)లో అనధికారికంగా ప్రవేశించి వైద్యాధికారులు, సిబ్బందిని బెదిరింపులకు గురిచేసిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్–డాక్టర్స్ ఫోరం ఆధ్వర్యంలో ప్రతినిధులు కోరారు. ఈ మేరకు కలెక్టర్కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 7న సాయంత్రం 4.30 గంటల సమయంలో లైబ్రరీ చైర్మన్గా చెప్పుకున్న అనిల్ కుమార్ అనే వ్యక్తి ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా పీహెచ్సీకి వచ్చి హాజరు రిజిస్టర్లు, మందుల నిల్వలను పరిశీలించినట్లు తెలిపారు. విధుల్లో ఉన్న మెడికల్ ఆఫీసర్ కుర్చీలో కూర్చొని, మీడియాను పిలిపించి వైద్యాధికారిపై ఆరోపణలు చేసినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అంతేకాకుండా కొంత మంది వ్యక్తులతో కలిసి ఆస్పత్రికి వచ్చి సిబ్బందిని, ఒంటరిగా విధులు నిర్వహిస్తున్న డ్యూటీ డాక్టర్ను భయాందోళనకు గురిచేసినట్లు పేర్కొన్నారు. దీనిపై వైద్యులు, సిబ్బంది ఆందోళన వ్యక్తం చేసినట్లు తెలిపారు.

**నిబంధనలకు విరుద్ధంగా తనిఖీలు..?**

ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ నిబంధనల ప్రకారం పీహెచ్సీలు, ఏరియా ఆసుపత్రుల్లో రికార్డులు పరిశీలించడం, తనిఖీలు నిర్వహించేందుకు నిర్దిష్ట అధికార పరిధి ఉంటుందని తెలిపారు. కలెక్టర్ ప్రత్యేకంగా లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేసిన సందర్భాల్లో మాత్రమే ఇతరులకు అనుమతి ఉంటుందని చెప్పారు. సరిహద్దు, మారుమూల ప్రాంతాల్లో పరిమిత వనరులతో ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న సిబ్బందికి భద్రత కల్పించాలని,



విధులకు ఆటంకం కలిగించే ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. సంబంధిత వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు కెరమెరి పీహెచ్సీ వద్ద తగిన భద్రతా చర్యలు చేపట్టాలని కలెక్టర్కు విజ్ఞప్తి చేశారు.

# ఎమ్మెల్యే వివాహ వార్షికోత్సవం సందర్భంగా రోగులకు పండ్ల పంపిణీ

**ఉద్యమ కెరటం, తాండూర్:** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి –రమ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం తాండూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, ఎనర్జీ డ్రింక్స్ పంపిణీ చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెద్దబోయిన శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ ఝాన్సీ రాణి సమక్షంలో రోగులకు పండ్లు, ఎనర్జీ డ్రింక్స్ అందజేశారు. ఈ సందర్భంగా రోగుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకో



వాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల జిల్లా డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం రవీందర్రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సలిగామ బానయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రజా ప్రతినిధుల పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలను సేవా కార్యక్రమాలతో నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తాండూర్ మండల కాంగ్రెస్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ షేక్ మోమిన్ అలీ, ప్రధాన కార్యదర్శి మల్లేష్, కార్యదర్శి సాంబయ్య, మాదారం ఉప సర్పంచ్ దామోదర్రెడ్డి, మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ దుర్గం మహేందర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పున్నం గౌడ్, ఎండి గౌస్, జావేద్, చీకటి వెంకటేష్ గౌడ్, తాళ్లపల్లి వెంకట్ గౌడ్, పుట్ట శ్రీను, జీతుల వేణు, ఇందూరి సత్తయ్య, మాసాడి ప్రభాకర్, పెద్దబోయిన పప్పీ, పెద్దబోయిన రవి, కొల్లూరి ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

**జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**

**ఉద్యమ కెరటం, సిరిసిల్ల:** స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో జిల్లా ఎస్పీ మహేష్ బి.గితెతో కలిసి వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది తప్పనిసరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జెండా ఆవిష్కరణ, వేదిక, మైదానం తదితర ఏర్పాట్లను పోలీస్, రెవెన్యూ, మున్సిపల్ శాఖల అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రతిబింబించేలా వివిధ శాఖల ఆధ్వర్యంలో స్టాళ్లు, శకటాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలో అమలవుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు, ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలపై ప్రజలకు అవగాహన కలిగేలా ప్రదర్శనలు ఉండాలని తెలిపారు. దేశ భక్తిని ప్రతిబింబించేలా విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేసేందుకు సంబంధించిన ప్రతిపాదనలను నిర్ణీత గడువులోగా సమర్పించాలన్నారు. ముఖ్య అతిథి ప్రసంగం కోసం జిల్లాలోని వివిధ శాఖలు చేపట్టిన ముఖ్యమైన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సంక్షిప్త నివేదికలను జిల్లా పౌర సంబంధాల అధికారికి అందజేయాలని ఆదేశించారు. జిల్లాకు చెందిన ప్రముఖులు, వివిధ రంగాల్లో విశిష్ట సేవలందిస్తున్న వ్యక్తులు వేడుకలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ శాఖ తమ కార్యాలయాల్లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించడంతో పాటు జిల్లా స్థాయి వేడుకలకు అధికారులు, సిబ్బంది హాజరయ్యేలా చూడాలని అన్నారు. వేడుకల



సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. స్వశక్తి మహిళా సంఘాల ప్రతినిధులు వేడుకల్లో పాల్గొనేలా చూడాలని, కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలు, అధికారులు, విద్యార్థులకు సరిపడా తాగునీటి వసతి కల్పించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, డీఆర్ఓ జయశ్రీ, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్బాబు, వివిధ ప్రభుత్వ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పవర్గూడలో ముమ్మరంగా పారిశుధ్య పనులు

**ఉద్యమ కెరటం, జైనూర్:** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ తదితర వ్యాధులు ప్రబలకుండా జైనూర్ మండలం పవర్గూడ గ్రామంలో ముమ్మరంగా పారిశుధ్య చర్యలు చేపట్టారు. గ్రామ సర్పంచ్ తొడసం రాజేందర్ ఆదేశాల మేరకు మంగళవారం గ్రామపంచాయతీ పరిధిలో మురుగు కాలువలు, పరిసర ప్రాంతాలను శుభ్రం చేసి దోమల మందును పిచికారీ చేశారు. పారిశుధ్యానికి ప్రథమ ప్రాధాన్యత ఇస్తూ గ్రామంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను గ్రాస్కట్టర్ సహాయంతో తొలగించారు. మురుగు నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి శుభ్రం చేయడంతో పాటు దోమల నివారణకు అవసరమైన చర్యలు చేపట్టారు. వర్షాకాలంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని గ్రామపంచాయతీ సిబ్బంది సూచించారు. గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



# తెలంగాణ సంస్కృతికి వారసులు కళాకారులే

- కళాకారుడి డప్పు శబ్దం.. ప్రజల గుండె చప్పుడు
- టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ





(ఉద్యమ కెరటం, మేడ్చల్)

తెలంగాణ అంటే కేవలం ఒక భౌగోళిక ప్రాంతం మాత్రమే కాదని, అది ఒక జీవన సంస్కృతి, ఆటపాటల పుట్ట అని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. విరాహత్ అలీ స్పష్టం చేశారు. పల్లె మట్టి పరిమళాన్ని తరతరాలకు అందిస్తున్న గొప్ప వారసులు మన జానపద కళాకారులేనని ఆయన కొనియాడారు. మంగళవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గాజుల రామారంలోని పద్మావతి కన్వెన్షన్‌లో "కలాలు, గలాల వేదిక" నిర్వహించిన 'బోనాల కళా జాతర' కార్యక్రమానికి ఆయన ప్రత్యేక అతిథిగా హాజరై ప్రసంగించారు. ప్రముఖ ప్రజా గాయకుడు దరువు అంజన్న ఈ సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ పుస్తకాల్లో లేని చరిత్రను తమ పాటల ద్వారా ప్రజలకు నేర్పించి, వారిని చైతన్యపరిచే శక్తి ప్రజా కళాకారులకే ఉందని చెప్పారు. సామాన్యుల జీవితాలను, రైతుల కష్టాలను, కూలీల, మహిళల భావాలను, పల్లె జీవనాన్ని తమ కళలో ప్రతిబింబించిన ఘనత కళాకారులకే దక్కుతుందని స్పష్టం చేశారు. కళాకారుడి చేతిలోని డప్పు కేవలం ఒక వాయిద్యం మాత్రమే కాదని, అది ప్రజల గుండె చప్పుడు అని, అతని గొంతులో వినిపించే పాట సమాజానికి ఒక సందేశం చైతన్యమని పేర్కొన్నారు. అందుకే కళాకారుడిని కేవలం వినోదం అందించే వ్యక్తిగా కాకుండా, ఒక చరిత్రకారుడిగా, సామాజిక కార్యకర్తగా, ప్రజల గొంతుకగా చూడాలని ఆయన కోరారు. కళ బతికితే సంస్కృతి బతుకుతుందని, సంస్కృతి బతికితే సమాజం బతుకుతుందని, సమాజం బతికితేనే మన అస్తిత్వం బతుకుతుందని ఆయన ఉద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు జి. బాల్ రాజ్ గౌడ్, కళాకారులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

# మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎండీ అహ్మద్ చొరవ



## 17వ వార్డులో పారిశుద్ధ్య సమస్య పరిష్కారం

**ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:** ఆసిఫాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ వార్డులో నెలకొన్న పారిశుద్ధ్య సమస్యలు తక్షణమే పరిష్కారమయ్యాయి. వార్డులోని హనుమాన్ టెంపుల్ సమీపంలో పిచ్చిమొక్కలు దట్టంగా పెరగడం, మట్టి కుప్పలు పేరుకుపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఉదయం వేళ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా వార్డులో పెరిగిన పిచ్చిమొక్కలు, ఉన్న మట్టి కుప్పలను ఆయన పరిశీలించారు. వెంటనే వాటిని తొలగించాలని అక్కడికక్కడే మున్సిపల్ అధికారులను ఆదేశించారు. వైస్ చైర్ పర్సన్ ఆదేశాలతో తక్షణమే రంగంలోకి దిగిన మున్సిపల్ సిబ్బంది, జేసీబీ యంత్రం సహాయంతో పిచ్చిమొక్కలను, మట్టి కుప్పలను పూర్తిగా తొలగించి ప్రాంతాన్ని శుభ్రం చేశారు. సమస్యను గుర్తించిన వెంటనే స్పందించి, త్వరితగతిన పరిష్కరించిన మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఎండి అహ్మద్ తో పాటు మున్సిపల్ అధికారులకు 17వ వార్డు ప్రజలు, కాలనీవాసులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్స్పెక్టర్ రామయ్య, సీపీఐ సీనియర్ నాయకులు బద్రి సత్యనారాయణ, వార్డు వాసులు అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

# 15న ఉచిత కంప్యూటర్ కోచింగ్ ప్రారంభం

## 32వ డివిజన్ కార్పొరేటర్ షేక్ యూసుఫ్



**ఉద్యమ కెరటం, కరీంనగర్:** కరీంనగర్‌లోని 32వ డివిజన్ (హుస్సేనిపుర) ప్రజల కోసం ఉచిత కంప్యూటర్ శిక్షణా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్ షేక్ యూసుఫ్, బీఆర్ఎస్ నాయకుడు వెల్లడించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఇప్పటికే పలు సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను పూర్తి చేశామని, అందులో భాగంగానే నాల్గొవ హామీగా యువత, పిల్లల భవిష్యత్తు కోసం ఈ ప్రభుత్వ గుర్తింపు పొందిన ఉచిత కంప్యూటర్ కోచింగ్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 15వ తేదీన (స్వాతంత్ర్య దినోత్సవం) మధ్యాహ్నం 2 గంటలకు కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ చేతుల మీదుగా ఈ కోచింగ్ సెంటర్‌ను ప్రారంభించనున్నట్లు కార్పొరేటర్ యూసుఫ్ పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని డివిజన్, పరిసర ప్రాంతాలలోని యువతీ యువకులు, విద్యార్థులు ఉపయోగించుకోవాలని కోరారు. ఆసక్తి ఉన్నవారు తమ ఆధార కార్డ్, 10వ తరగతి మెమో (సర్టిఫికేట్)తో తమ కార్యాలయంలో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. కోర్సు పూర్తి చేసిన వారికి ప్రభుత్వ గుర్తింపు పొందిన సర్టిఫికేట్లను అందజేస్తామని తెలిపారు. అలాగే, భవిష్యత్తులో మిగిలిన హామీలను (అంతిమ యాత్ర వాహనం మొదలైనవి) కూడా త్వరలోనే నెరవేరుస్తామని హామీ ఇచ్చారు. ఆగస్టు 15న జరిగే ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి డివిజన్ ప్రజలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కార్పొరేటర్ యూసుఫ్, బిఆర్ఎస్ నేతలు విజ్ఞప్తి చేశారు.



# ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ జన్మదిన వేడుకలు

## వెంకటాపురంలో కేక్ కట్ చేసిన కాంగ్రెస్ నాయకులు

**ఉద్యమ కెరటం, సత్తుపల్లి:** ఖమ్మం జిల్లా వేంసూరు మండల పరిధిలోని వెంకటాపురం గ్రామంలో సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ నాయకుడు జంగా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ గ్రామంలో ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం, గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ నాయకత్వంలో నియోజకవర్గ అభివృద్ధికి మరింత ఊపునిస్తామని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌళిక వసతులు కల్పించేందుకు నిరంతరం కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పుచ్చకాయల సోమిరెడ్డి, గొర్ల శ్రీనివాసరెడ్డి, పుచ్చకాయల చెన్నారెడ్డి, గొర్ల శ్రీనివాసరెడ్డి, గండ్ర నాగిరెడ్డి, గ్రామ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# చేయూత పింఛన్లకు 'గోల్డెన్ ఛాన్స్'

## అర్హులైన ఏ ఒక్కరూ మిస్ కావొద్దు.. ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

## గ్రామం, వార్డు వారీగా సర్వే.. అర్హులతో దరఖాస్తు చేయించాలి

## సమన్వయంతో పనిచేయాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా

**ఉద్యమ కెరటం, కరీంనగర్:** అర్హులైన పేదలకు చేయూత పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో జిల్లాలో అర్హులైన ఏ ఒక్కరూ మిస్ కాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. కొత్తగా పింఛన్లకు అర్హత పొందే వారిని శాచురేషన్ మోడ్‌లో గుర్తించి, వారం రోజుల్లో అర్హులందరినీ గుర్తించేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ప్రతి గ్రామము ప్రతి వార్డు వైజ్ గా ఈ ప్రక్రియ యుద్ధ ప్రాతిపదికన పకడ్బందీగా చేపట్టాలని స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్‌లో డి ఆర్డిఓ, జిల్లా సంక్షేమ శాఖ, మెప్మా, జిల్లా పంచాయతీ అధికారి, జిల్లా పరిషత్, మున్సిపల్ అధికారులతో కలెక్టర్ చిత్రా మిశ్రా చేయూత పింఛన్ల దరఖాస్తుల ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. గ్రామం, వార్డు వారీగా ముందుగా అర్హులను గుర్తించి, వారితో దరఖాస్తులు చేయించే విధానం.. చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాష్ట్ర ప్రభుత్వం చాలా ఏళ్ల తర్వాత అత్యంత ప్రతిష్టాత్మకంగా కొత్తగా చేయూత పింఛన్లు మంజూరు చేసేందుకు చర్యలు చేపడుతోందని కలెక్టర్ తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన పేదలందరికీ అందేలా అధికారులు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ఆగస్టు 31 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నందున ప్రతి గ్రామం, ప్రతి వార్డు నుంచి అర్హులు దరఖాస్తు చేసుకునేలా విస్తృతంగా చైతన్యం కల్పించాలని ఆదేశించారు. తొలి దశలో వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, ఫైలేరియా బాధితులు, తలసేమియా, సికిల్ సెల్ డిసీజ్, హీమోఫీలియా వంటి రక్త సంబంధిత వ్యాధులతో బాధపడుతున్న దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వనున్న నేపథ్యంలో ఆయా వర్గాలకు చెందిన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని తెలిపారు. గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, ఇతర సిబ్బంది సహకారంతో విస్తృతంగా సర్వే నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు, ప్రత్యేక అవసరాలు గల పిల్లలు, ఒంటరి మహిళలు, వితంతువులు, ఇతర పింఛన్లకు అర్హులైన వారిని గుర్తించి దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఒక్క అర్హుడి కేసు కూడా మిస్ కాకుండా అధికారులు ఈ ప్రక్రియను ఒక సవాలుగా తీసుకోవాలని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కొత్తగా ఎంతమంది పింఛన్లకు అర్హులవుతారో కార్యాచరణ ప్రణాళిక ప్రకారం గుర్తించి, వారి నుంచి దరఖాస్తులు స్వీకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని చెప్పారు. ఒంటరి మహిళలు తమ జనన ధ్రువపత్రం, ఎస్సెస్సీ మెమో, ఓటరు గుర్తింపు కార్డు (జూ×జ) వంటి అందుబాటులో ఉన్న పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని అధికారులు అవగాహన కల్పించాలనీ, అవసరమైన సందర్భాల్లో స్థానిక విచారణ, సంబంధిత ధ్రువీకరణ ప్రక్రియను పూర్తి చేయించాలని సూచించారు. వితంతు మహిళలు తమ భర్త మరణ ధ్రువపత్రాన్ని అందుబాటులో ఉంచుకోవాలని, దివ్యాంగులు సదరం సర్టిఫికెట్ సిద్ధంగా ఉంచుకుని చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేలా అధికారులు ప్రోత్సహించాలని కలెక్టర్ తెలిపారు. కరీంనగర్ నగరపాలక సంస్థతోపాటు చొప్పదండి, హుజూరాబాద్, జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో ఈ ప్రక్రియను మరింత సవాలుగా తీసుకుని అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. కరీంనగర్‌లో కార్పొరేటర్లు, ఇతర మున్సిపాలిటీల్లో కౌన్సిలర్లు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో మున్సిపల్ అధికారులు ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామాల్లో అంగన్వాడి కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర సిబ్బంది, స్వయం సహాయక సంఘాల మహిళల సహకారం తీసుకుని అర్హుల గుర్తింపు, దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, సంక్షేమ శాఖ, మెప్మా, పంచాయతీరాజ్, మున్సిపల్ తదితర శాఖల అధికారులు, సిబ్బంది ప్రత్యేక చొరవతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. అర్హుల గుర్తింపు నుంచి దరఖాస్తుల స్వీకరణ, ఆన్‌లైన్ డేటా నమోదు, క్షేత్రస్థాయి పరిశీలన, తుది జాబితా తయారీ వరకు ఎక్కడా తప్పిదాలు జరగకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ సూచించారు. పేదలకు ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులందరికీ చేరువ చేయడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు. పేదలకు న్యాయం చేయడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని అర్హులను మాత్రం మిస్ చేయవద్దని మరోసారి సూచించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, డీఆర్‌డీవో గీత, మెప్మా పీడీ స్వరూపారాణి, డీపీవో జగదీశ్వర్‌తో పాటు మున్సిపల్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో 7 కిలోల వెండి నాణేలు

**ఉద్యమ కెరటం, శంషాబాద్:** శంషాబాద్ విమానాశ్రయంలో ఢిల్లీ వెళ్తున్న ఓ ప్రయాణికుడి వద్ద ఏడు కిలోల వెండి నాణేలను అధికారులు గుర్తించారు. మంగళవారం ప్రయాణికులను తనిఖీ చేస్తున్న సమయంలో భారీ మొత్తంలో వెండి నాణేలు బయటపడడంతో అధికారులు వాటికి సంబంధించిన వివరాలను ఆరా తీశారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శంషాబాద్ నుంచి ఢిల్లీ వెళ్లేందుకు వచ్చిన ఓ ప్రయాణికుడి సామగ్రిని తనిఖీ చేయగా ఏడు కిలోల వెండి నాణేలు కనిపించాయి. దీంతో అధికారులు వాటికి సంబంధించిన కొనుగోలు, రవాణా పత్రాలను చూపించాలని కోరారు. ప్రయాణికుడు వెండి నాణేలకు సంబంధించిన సరైన పత్రాలను అధికారులకు సమర్పించడంతో వాటిని పరిశీలించిన అనంతరం అతడిని ఢిల్లీ వెళ్లేందుకు అనుమతించినట్లు సమాచారం.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

# ప్రపంచాన్ని ఏలిన విండీస్‌కు.. ఇప్పుడు బెర్త్ కోసం అగ్నిపరీక్ష!

- ఒకప్పుడు వన్డే క్రికెట్‌లో తిరుగులేని ఆధిపత్యం
- రెండుసార్లు ప్రపంచకప్ విజేతకు ఇప్పుడు క్వాలిఫయర్స్ గండం
- నేరుగా అర్హత అవకాశాలకు అఫ్గానిస్థాన్ గండి
- ప్రపంచకప్ చేరాలంటే సుదీర్ఘ క్వాలిఫయింగ్ పోరు
- కరేబియన్ దిగ్గజాలు గట్టెక్కుతారా?.. మళ్లీ నిరాశేనా?



**న్యూఢిల్లీ:** ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌ను ఏకచక్రాధిపత్యంతో ఏలిన వెస్టిండీస్ జట్టు పరిస్థితి ఇప్పుడు ప్రపంచకప్ బెర్త్ కోసం పాకులాడే స్థాయికి చేరింది. రెండుసార్లు వన్డే ప్రపంచకప్, రెండుసార్లు టీ20 ప్రపంచకప్‌ను ముద్దాడిన కరేబియన్ జట్టు.. వచ్చే ఏడాది జరిగే 50 ఓవర్ల ప్రపంచకప్‌నకు నేరుగా అర్హత సాధించే అవకాశాన్ని మరోసారి చేజార్చుకుంది. ఐసీసీ నిబంధనల ప్రకారం నిర్ణీత గడువు నాటికి ర్యాంకింగ్స్‌లో అర్హత స్థానాల్లో నిలిచే జట్లకు నేరుగా ప్రపంచకప్ బెర్త్ దక్కుతుంది. అయితే ఐర్లాండ్‌తో జరిగిన ఉత్కంఠ పోరులో అఫ్గానిస్థాన్ విజయంతో పుంజుకోవడం వెస్టిండీస్ అవకాశాలను దెబ్బతీసింది. దీంతో కరేబియన్ జట్టు ఇప్పుడు ప్రపంచకప్‌కు చేరాలంటే కఠినమైన క్వాలిఫయింగ్ ప్రక్రియను ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. నాలుగేళ్ల క్రితం కూడా వెస్టిండీస్‌కు ఇలాంటి చేదు అనుభవమే ఎదురైంది. క్వాలిఫయర్స్‌లో విఫలమై సుదీర్ఘ క్రికెట్ చరిత్రలో తొలిసారిగా వన్డే ప్రపంచకప్‌నకు అర్హత సాధించలేకపోయింది. ఆ పరాభవం కారణంగా తర్వాతి ఛాంపియన్స్ ట్రోఫీ అవకాశాన్నీ కోల్పోయింది. ఇప్పుడు మరోసారి అదే ప్రమాదం కరేబియన్ జట్టును వెంటాడుతోంది. ప్రపంచకప్ బెర్త్ సాధించాలంటే వెస్టిండీస్ సుదీర్ఘమైన అర్హత పోరును దాటాల్సి ఉంటుంది. ప్రధాన క్వాలిఫయర్‌లో అగ్రస్థానాల్లో నిలవడంతో పాటు తదుపరి దశల్లోనూ నిలకడగా రాణించాల్సి ఉంటుంది. ఒకప్పుడు ప్రత్యర్థులకు ప్రపంచకప్ గెలవనివ్వకుండా అడ్డుగోడలా నిలిచిన జట్టు.. ఇప్పుడు తానే ప్రపంచకప్‌లో చోటు కోసం పోరాడాల్సి రావడం కరేబియన్ క్రికెట్ పతనానికి అద్దం పడుతోంది. వివియన్ రిచర్డ్స్, క్లైవ్ లాయిడ్, గార్డన్ గ్రీనిడ్జ్, మైఖేల్ హోల్డింగ్ వంటి దిగ్గజాలతో ప్రపంచ క్రికెట్‌ను వణికించిన వెస్టిండీస్.. మళ్లీ ఆ వైభవాన్ని అందుకుంటుందా? కఠినమైన అర్హత పోరును దాటి ప్రపంచకప్ వేదికపై అడుగుపెడుతుందా? లేక మరోసారి మెగా టోర్నీకి ప్రేక్షకపాత్రకే పరిమితమవుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## పసికూనకు ప్రపంచకప్ బెర్త్.. రెండుసార్లు ఛాంపియన్‌కు బిగ్ షాక్!

### 2027 వన్డే ప్రపంచకప్‌కు నేరుగా అఫ్గానిస్థాన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** అంతర్జాతీయ క్రికెట్‌లో పసికూనగా ప్రస్థానం ప్రారంభించి సంచలన విజయాలతో దిగ్గజ జట్లకు సవాల్ విసురుతున్న అఫ్గానిస్థాన్ మరో ఘనత సాధించింది. 2027 వన్డే ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించింది. ఐర్లాండ్‌తో జరిగిన మూడో వన్డేలో మూడు వికెట్ల తేడాతో విజయం సాధించడంతో మెగా టోర్నీలో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. మరోవైపు ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌ను ఏలిన రెండుసార్లు వన్డే ప్రపంచకప్ ఛాంపియన్ వెస్టిండీస్‌కు ఈ పరిణామం భారీ షాక్‌గా మారింది. ఐర్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ ఆల్‌రౌండ్ ప్రదర్శనతో జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. బౌలింగ్‌లో మూడు వికెట్లు పడగొట్టిన రషీద్.. బ్యాటింగ్‌లో కీలక సమయంలో 43 బంతుల్లో అజేయంగా 37 పరుగులు చేసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. దీంతో అతడికి 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు దక్కింది. ఐదు వన్డేల సిరీస్‌లో అఫ్గానిస్థాన్ 2-0 ఆధిక్యంలో నిలిచింది. తొలి మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. 2023 వన్డే ప్రపంచకప్‌లోనే అఫ్గానిస్థాన్ తన సత్తా ఏమిటో ప్రపంచానికి చాటింది. ఆ టోర్నీలో నాలుగు విజయాలు సాధించి పాయింట్ల పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది. ఇంగ్లండ్, శ్రీలంక, పాకిస్థాన్ వంటి బలమైన జట్లను మట్టికరిపించి సంచలనం సృష్టించింది. రషీద్ ఖాన్ వంటి అనుభవజ్ఞులతో పాటు యువ ఆటగాళ్లు రాణిస్తుండటంతో 2027 ప్రపంచకప్‌లో మరింత మెరుగైన ప్రదర్శన చేయాలన్న పట్టుదలతో అఫ్గాన్ ఉంది.



విండీస్‌కు అఫ్గాన్ దెబ్బ

అఫ్గానిస్థాన్ విజయం వెస్టిండీస్ ఆశలపై నీళ్లు చల్లింది.

ఒకప్పుడు ప్రపంచ క్రికెట్‌లో తిరుగులేని శక్తిగా వెలుగొందిన కరేబియన్ జట్టు 2027 ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించే అవకాశాన్ని కోల్పోయింది. గత ప్రపంచకప్‌నకు కూడా నేరుగా అర్హత పొందలేకపోయిన వెస్టిండీస్.. క్వాలిఫయర్స్‌లోనూ విఫలమై తొలిసారిగా మెగా టోర్నీకి దూరమైంది. ఇప్పుడు మరోసారి అదే కఠిన పరిస్థితిని ఎదుర్కొంటోంది. వన్డే ర్యాంకింగ్స్ ఆధారంగా ప్రపంచకప్‌కు నేరుగా అర్హత సాధించేందుకు సెప్టెంబర్ 30ను గడువుగా నిర్ణయించారు. ఆతిథ్య దేశాలైన దక్షిణాఫ్రికా, జింబాబ్వేలకు ఆటోమేటిక్ బెర్త్ లభిస్తుంది. మిగిలిన స్థానాలకు ర్యాంకింగ్స్ కీలకం కానున్నాయి. ఐర్లాండ్‌పై విజయంతో అఫ్గానిస్థాన్ తన స్థానాన్ని పదిలం చేసుకోవడంతో వెస్టిండీస్‌కు నేరుగా ప్రపంచకప్ చేరే మార్గం మూసుకుపోయింది. కటాఫ్ తేదీకి ముందు వెస్టిండీస్‌కు మరో రెండు వన్డేలు మాత్రమే మిగిలి ఉన్నాయి. వాటిలో గెలిచినా అఫ్గానిస్థాన్‌ను వెనక్కినెట్టి నేరుగా అర్హత సాధించే అవకాశం లేదన్న సమీకరణాలు కరేబియన్ జట్టును కలవరపెడుతున్నాయి.

### క్వాలిఫయర్సే దిక్కు!

ఇక వెస్టిండీస్ ప్రపంచకప్‌లో ఆడాలంటే క్వాలిఫయర్స్‌లో సత్తా చాటాల్సిందే. 10 జట్లతో జరిగే అర్హత టోర్నీలో కీలక విజయాలు సాధించి ప్రపంచకప్ బెర్త్‌ను దక్కించుకోవాల్సి ఉంటుంది. ఒకప్పుడు ప్రత్యర్థులకు ప్రపంచకప్ గెలవనివ్వకుండా అడ్డుగోడగా నిలిచిన రెండుసార్లు ఛాంపియన్.. ఇప్పుడు పసికూనగా మొదలైన అఫ్గానిస్థాన్ నేరుగా బెర్త్ కొట్టేస్తుంటే తాను మాత్రం క్వాలిఫయర్స్ బాట పట్టాల్సి రావడం కరేబియన్ క్రికెట్ పతనానికి అద్దం పడుతోంది.

# 29 టెస్టులు.. 29 మైదానాలు!

- ఇదెక్కడి వింత రికార్డు జైస్వాల్!
- ఆడిన ప్రతీ టెస్టుకూ కొత్త వేదికే
- ఒక్క మైదానంలోనూ రెండోసారి ఆడని ఓపెనర్
- గాల్‌లో 30వ టెస్టుతో అరుదైన ఘనతకు అడుగు
- 29 టెస్టుల్లో 2,535 పరుగులు.. ఏడు శతకాలు
- శ్రీలంక సిరీస్‌లో జైస్వాల్‌పైనే అందరి చూపు



**న్యూఢిల్లీ, ఆగస్టు 11:** భారత యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్ టెస్టు క్రికెట్‌లో బ్యాటుతో పరుగుల వరద పారించడమే కాదు.. ఓ విచిత్రమైన రికార్డుతోనూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాడు. ఇప్పటివరకు కెరీర్‌లో 29 టెస్టులు ఆడిన జైస్వాల్.. ఆ 29 మ్యాచ్‌లనూ 29 వేర్వేరు వేదికల్లో ఆడటం విశేషం. ఒక్క మైదానం కూడా పునరావృతం కాకపోవడం ఈ రికార్డును మరింత ఆసక్తికరంగా మార్చింది. 2023లో వెస్టిండీస్‌పై టెస్టుల్లో అరంగేట్రం చేసిన జైస్వాల్.. ఆ తర్వాత భారత జట్టులో రెగ్యులర్ ఓపెనర్‌గా స్థానం సుస్థిరం చేసుకున్నాడు. స్వదేశంతో పాటు విదేశాల్లోనూ వరుసగా అవకాశాలు అందుకున్నా.. ప్రతి టెస్టుకూ వేదిక మారుతూ వచ్చింది. అలా 29 టెస్టులు పూర్తయ్యేసరికి 29 వేర్వేరు మైదానాల్లో ఆడిన అరుదైన ఘనత అతడి ఖాతాలో చేరింది. ఇప్పుడు శ్రీలంకతో జరిగే రెండు టెస్టుల సిరీస్‌లో జైస్వాల్ మరో ఆసక్తికర మైలురాయి అందుకోనున్నాడు. ఆగస్టు 15 నుంచి గాల్‌లో జరిగే తొలి టెస్టు అతడి కెరీర్‌లో 30వది కానుంది. గాల్‌లోనూ జైస్వాల్‌కు ఇదే తొలి టెస్టు కావడంతో '30 టెస్టులు.. 30 వేదికలు' అనే అరుదైన రికార్డు కొనసాగనుంది. జైస్వాల్ ఇప్పటివరకు 29 టెస్టుల్లోని 54 ఇన్నింగ్స్‌లలో 48.75 సగటుతో 2,535 పరుగులు సాధించాడు. ఇందులో ఏడు శతకాలు, 13 అర్ధశతకాలు ఉన్నాయి. అత్యధిక స్కోరు 214 పరుగులు కాగా.. రెండు ద్విశతకాలు కూడా అతడి ఖాతాలో ఉన్నాయి. 317 ఫోర్లు, 45 సిక్సర్లతో సుదీర్ఘ ఫార్మాట్‌లోనూ తనదైన దూకుడు చూపిస్తున్నాడు. జూన్‌లో అఫ్గానిస్థాన్‌పై తన 29వ టెస్టు ఆడిన జైస్వాల్.. ఇప్పుడు శ్రీలంక గడ్డపై సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నాడు. ఆగస్టు 15 నుంచి 19 వరకు గాల్‌లో తొలి టెస్టు, 23 నుంచి 27 వరకు కొలంబోలో రెండో టెస్టు జరగనున్నాయి. గాల్ తర్వాత కొలంబో కూడా అతడికి కొత్త వేదిక కావడంతో ఈ విచిత్రమైన రికార్డు మరింత ముందుకు సాగే అవకాశముంది.



## చైనా గడ్డపై శ్రేయాషి చరిత్ర

### అంతర్జాతీయ ఇన్‌లైన్ ఫ్రీస్టైల్‌లో కాంస్య పతకం

### ఈ టోర్నీలో పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా రికార్డు

**న్యూ ఢిల్లీ:** భారత స్కేటింగ్ క్రీడాకారిణి శ్రేయాషి జోషి అంతర్జాతీయ వేదికపై సత్తా చాటి చరిత్ర సృష్టించింది. చైనాలో ఆగస్టు 9 నుంచి 12 వరకు నిర్వహించిన సీనియర్ ఉమెన్స్ క్లాసిక్ లిషుయ్ ఇన్‌లైన్ ఫ్రీస్టైల్ అంతర్జాతీయ టోర్నీలో కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. దీంతో ఈ టోర్నీలో పతకం సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. ఆసియా రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్స్‌లో ఇప్పటికే స్వర్ణ పతకాలతో తన ప్రతిభను చాటుకున్న శ్రేయాషి.. ఇప్పుడు అంతర్జాతీయ పోటీల్లోనూ పతకం సాధించి భారత కీర్తిపతాకను రెపరెపలాడించింది. క్లాసిక్ స్లాలోమ్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చి కాంస్యాన్ని అందుకుంది. మహారాష్ట్రలోని పుణెలో జన్మించిన శ్రేయాషి జోషికి చిన్నతనం నుంచే స్కేటింగ్‌పై ఆసక్తి ఏర్పడింది. మూడేళ్ల వయసులోనే తన సోదరి స్వరాలితో కలిసి స్కేటింగ్ ప్రారంభించింది. ఆరేళ్లు వచ్చేసరికి జాతీయస్థాయి క్రీడాకారిణిగా ఎదిగి అందరి దృష్టిని ఆకర్షించింది. 2021లో మొహాలిలో నిర్వహించిన 59వ జాతీయ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్స్‌లో స్పీడ్ స్లాలోమ్, క్లాసిక్ స్లాలోమ్ విభాగాల్లో శ్రేయాషి రెండు స్వర్ణ పతకాలను సాధించింది. 2024లో బెంగళూరులో జరిగిన 62వ జాతీయ చాంపియన్‌షిప్స్‌లోనూ ఇదే జోరు కొనసాగిస్తూ స్పీడ్, క్లాసిక్ స్లాలోమ్ రెండింటిలో స్వర్ణాలు గెలుచుకుంది. రెండు విభాగాల్లోనూ స్వర్ణాలు సాధించిన భారత స్కేటర్లలో జినేష్ నానల్‌తో కలిసి ప్రత్యేక గుర్తింపు పొందింది. 2017లో చైనాలోని నాన్‌జింగ్‌లో జరిగిన ప్రపంచ రోలర్ గేమ్స్‌లో కేవలం 12 ఏళ్ల వయసులోనే శ్రేయాషి భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. ఫ్రీస్టైల్, స్పీడ్ విభాగాల్లో వరుసగా 20, 22వ స్థానాల్లో నిలిచి అంతర్జాతీయ వేదికపై తన ప్రయాణాన్ని ప్రారంభించింది. 2025లో దక్షిణ కొరియాలో జరిగిన ఆసియా రోలర్ స్కేటింగ్ పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు సాధించి సంచలనం సృష్టించింది. ఇన్‌లైన్ ఫ్రీస్టైల్, క్లాసిక్ స్లాలోమ్‌లో స్వర్ణాలు సాధించిన తొలి భారత క్రీడాకారిణిగా అప్పట్లో రికార్డు నెలకొల్పింది. తాజాగా చైనా గడ్డపై కాంస్య పతకం సాధించి తన విజయ ప్రస్థానంలో మరో చారిత్రక ఘనతను జోడించింది.





## బోదన, శ్రేయస్ అదరహో..

### బ్రిటీష్ చెస్ చాంపియన్‌షిప్స్‌లో టైటిళ్లు కైవసం

### లండన్‌లో భారత సంతతి చెస్ ప్లేయర్ల సత్తా

**లండన్:** పసివయసులోనే 64 గళ్ల ఆటపై మక్కువ పెంచుకుని ఆటలో అద్భుతాలు సృష్టిస్తున్న బోదన శివానందన్, శ్రేయస్ రాయల్ బ్రిటన్ గడ్డపై సత్తాచాటారు. 122 ఏండ్ల చరిత్ర కలిగిన ప్రతిష్టాత్మక బ్రిటీష్ చెస్ చాంపియన్‌షిప్స్‌లో భారత సంతతికి చెందిన ఈ ఇద్దరు చెస్ ప్లేయర్లూ.. తమ విభాగాల్లో టైటిళ్లు గెలిచి ఔరా అనిపించారు. సుమారు 1,750 మంది ప్లేయర్లు పాల్గొన్న ఈ టోర్నీలో 11 ఏండ్ల బోదన.. మహిళల విభాగంలో చాంపియన్‌గా నిలువగా ఓపెన్ కేటగిరీలో17 ఏండ్ల శ్రేయస్ విజయం సాధించాడు. ఆదివారం ఉత్కంఠగా జరిగిన ర్యాపిడ్ చెస్ ప్లేఆఫ్స్‌లో బోదన.. ఐర్లాండ్‌కు చెందిన 14 ఏండ్ల త్రిషా కన్యమరలను ఓడించి టైటిల్‌ను సొంతం చేసుకుంది. దీంతో ఆ చిన్నారి బ్రిటన్ యంగెస్ట్ ఉమెన్స్ చెస్ చాంపియన్‌గా సరికొత్త రికార్డులు సృష్టించింది. నార్త్ వెస్ట్ లండన్‌లో నివసిస్తున్న బోదన.. కోవిడ్ సమయంలో చెస్ నేర్చుకుంది. ఇప్పటికే యూకే ఓపెన్ ఉమెన్స్ బ్లిట్జ్ చాంపియన్ గెలవడంతో పాటు బ్రిటీష్ ఉమెన్స్ ర్యాపిడ్ విజేతగా నిలిచి సత్తాచాటింది. తాజాగా క్లాసికల్ ఫార్మాట్‌లోనూ ఆమె టైటిల్ గెలవడం గమనార్హం. ఇక ఓపెన్ విభాగంలో శ్రేయస్.. తొమ్మిది రౌండ్ల తర్వాత బ్రిటన్‌లో అగ్రశ్రేణి గ్రాండ్‌మాస్టర్లను దాటుకుని పాయింట్ల పట్టికలో అగ్రస్థానాన నిలిచి విజేతగా నిలిచాడు. 15 ఏండ్ల వయసులోనే ఇంగ్లండ్‌లో అతిపిన్న గ్రాండ్‌మాస్టర్‌గా గుర్తింపుపొందిన అతడు.. పుట్టింది బెంగళూరులోనే. ఎనిమిదేండ్ల క్రితం శ్రేయస్ తల్లిదండ్రులు లండన్‌లో స్థిరపడ్డారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక
బుధవారం
12 ఆగస్టు 2026

# మానస అందాల మెరుపులు



సినిమాల పరంగా కాస్త నెమ్మదిగా సాగుతున్నా.. అందాల ప్రదర్శనలో మాత్రం మానస వర్మ జోరు కొనసాగిస్తోంది. 'వనవీర' తర్వాత ఆమె నుంచి మరో సినిమా ప్రకటన కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈలోగా సామాజిక మాధ్యమాల్లో తన తాజా ఫొటోలను పంచుకుంటూ అభిమానులను అలరిస్తోంది. తాజాగా రంగురంగుల దుస్తుల్లో మెరిసిన మానస వర్మ అందరి దృష్టినీ ఆకర్షించింది. నారింజ–ఎరుపు రంగు పైదుస్తులకు గులాబీ రంగు పొడవాటి స్కర్ట్‌ను జతచేసి మానస ధరించిన తీరు ప్రత్యేకంగా కనిపించింది. పలుచని పట్టీలతో కూడిన దుస్తులు ఆమెకు చక్కని వేసవి అందాన్ని తీసుకొచ్చాయి. వదులుగా వదిలేసిన ముంగురులు, సున్నితమైన బంగారు ఆభరణాలు, సహజమైన అలంకరణతో ఎంతో అందంగా కనిపించింది. ముఖ్యంగా ఆమె చిరునవ్వు చిత్రాలకు మరింత ఆకర్షణను తీసుకొచ్చింది. సరస్సు ఒడ్డున ప్రకృతి అందాల మధ్య మానస ఇచ్చిన పోజులు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ప్రశాంతమైన నేపథ్యానికి భిన్నంగా మెరిసే దుస్తుల రంగులు ఈ చిత్రాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విహారయాత్రకు వెళ్లిన అందాల భామను తలపించేలా ఉన్న ఈ ఫొటోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.

## మోహన్ లాల్ కుమార్తె విస్మయ

### తుడక్కం మూవీతో అరంగేట్రం




మలయాళ యాక్షన్ థ్రిల్లర్ 'తుడక్కం'తో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు మోహన్ లాల్ కుమార్తె విస్మయ . జూడ్ ఆంటోనీ జోసెఫ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం రికార్డులు సృష్టిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా అత్యధిక ఓపెనింగ్స్ సాధించిన మహిళా ప్రాధాన్యమున్న మలయాళ చిత్రంగా నిలిచింది. బాక్సాఫీస్ నివేదికల ప్రకారం.. 'తుడక్కం' మొదటి రోజు ప్రపంచవ్యాప్తంగా రూ.6.8 కోట్లు వసూలు చేసింది. భారత్‌లో 1100ల థియేటర్‌లలో దీన్ని విడుదల చేశారు. ఓవర్సీస్‌లోనూ దీనికి మంచి స్పందన రావడంతో రికార్డు నెలకొల్పింది. మొదటి రోజు భారత్‌లో రూ.2.55 కోట్లు సొంతం చేసుకుంది. దీంతో అంతకుముందు కల్యాణి ప్రియదర్శన్ నటించిన 'కొత్తలోక' సినిమా తొలిరోజు (రూ.6.63 కోట్ల) ప్రపంచ వ్యాప్త వసూళ్లను 'తుడక్కం' అధిగమించింది. విస్మయ మోహన్‌లాల్, ప్రముఖ నిర్మాత ఆంటోనీ పెరుంబావూర్ కుమారుడు ఆశిష్ జోస్ ఆంటోనీలకు ఇది తొలి చిత్రం. 'మీను' పాత్రలో విస్మయ ఎంతో సహజంగా నటించగా, ఆశిష్ సైకో పాత్రలో తన నటనతో భయపెట్టారు. సమాజంలో మహిళలు ఎదుర్కొనే వేధింపులు, లైంగిక దాడులు, మనుగడ కోసం ఒక యువతి చేసే పోరాటం నేపథ్యంలో సాగే ఈ క్రైమ్ థ్రిల్లర్‌లో మోహన్‌లాల్ అతిథి పాత్రలో కనిపించి ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

# సన్నని సోయగంతో కావ్యా థాపర్

### అభిమానులను ఆకట్టుకుంటున్న కథానాయిక

### నీలిరంగు దుస్తుల్లో అందాల విందు

### తాజా ఫొటోలతో సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్



సినిమా: కథానాయిక కావ్యా థాపర్ కొత్త రూపంతో అభిమానులను ఆకట్టుకుంటోంది. తాజాగా సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న ఫొటోల్లో మునుపటి కంటే మరింత సన్నగా, చక్కటి ఆకృతితో కనిపిస్తూ సందడి చేసింది. బరువు తగ్గి కొత్త రూపంలో మెరిసిపోతున్న కావ్యా ఫొటోలపై అభిమానులు ఆసక్తిగా స్పందిస్తున్నారు. నీలం రంగు ముద్రిత పొడవాటి దుస్తుల్లో కావ్యా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. నడుము భాగంలో ప్రత్యేక ఆకృతి, కిందకు వాలుగా ఉన్న దుస్తుల తీరు ఆమె సోయగాన్ని మరింత ఇనుమడింపజేశాయి. చేతులకు బంగారు గాజులు, కాళ్లకు ఎత్తుమడమల చెప్పులతో అందంగా ముస్తాబైన ఆమె కెమెరా ముందు సరదాగా పోజులిచ్చింది. తన కొత్త రూపాన్ని ఆత్మవిశ్వాసంతో ప్రదర్శిస్తూ అభిమానుల చూపు తిప్పుకోనివ్వకుండా చేసింది. కావ్యా థాపర్ చివరిసారిగా 2024లో విడుదలైన 'విశ్వం' చిత్రంలో ప్రేక్షకులను పలకరించింది. ఆ తర్వాత ఆమె నటించిన మరో చిత్రం తెరపైకి రాలేదు. కొత్త సినిమా అవకాశాల కోసం ఎదురుచూస్తున్న ఈ భామ.. మరోవైపు ఎప్పటికప్పుడు తన తాజా ఫొటోలను అభిమానులతో పంచుకుంటూ సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తోంది.

## పళ్ల బురుసు సందేశాత్మక చిత్రం

'పళ్ళ బురుసు' లాంటి మంచి సందేశాత్మక చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై నిర్మిస్తున్నందుకు ఎంతో ఆనందంగా ఉందన్నారు నిర్మాత సుప్రియ యార్లగడ్డ. సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్, ప్రజ్వల్, గోమతి రెడ్డి ప్రధాన పాత్రలు పోషించిన ఈ సినిమాని ఉదయ్ చౌహాన్ తెరకెక్కించారు. ఈ నెల 14న విడుదల కానుంది. ఈ నేపథ్యంలోనే సోమవారం హైదరాబాద్‌లో ప్రీరిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుప్రియ మాట్లాడుతూ.. ఏఎన్నార్ ఉండిఉంటే మంచి చిత్రాన్ని నిర్మిస్తున్నందుకు ప్రశంసించేవారని అన్నారు. 'అందరూ ఎంతో ప్రేమించి తీసిన సినిమా 'పళ్ళ బురుసు'. దీన్ని చూస్తున్నంత సేపూ నవ్వుతూనే ఉన్నా. అదే సమయంలో కన్నీళ్లొచ్చాయి. మనసు బరువెక్కింది. ఇంత మంచి సినిమా చేసినందుకు చాలా తృప్తిగా అనిపించిందని నాగార్జున అన్నారు. . ఆయన అన్నపూర్ణ స్టూడియోస్ పతాకంపై మరో నిర్మాత వివేక్ కృష్ణపాణితో కలిసి నిర్మించిన చిత్రమే 'పళ్ళ బురుసు'. అన్నపూర్ణ స్టూడియోస్ 50ఏళ్లు పూర్తి చేసుకుంది. నాన్న ప్రారంభించిన ఈ సంస్థలో ఎన్నో చక్కటి సినిమాలు చేశాం. ఈ 50వ సంవత్సరం కొన్ని కీలక నిర్ణయాలు తీసుకున్నాం. అన్నపూర్ణ డిస్ట్రిబ్యూషన్‌ని విస్తరించాం. ఇక ఈ చిత్ర విషయానికొస్తే.. తల్లిదండ్రుల్ని మనం చూసుకున్న దానికన్నా అదృష్టం ఇంకేదీ ఉండదు. అది చాలా ముఖ్యం. అలా నా తల్లిదండ్రుల్ని నేను చూసుకున్నా. ఇప్పటికీ అమల కూడా వాళ్ల అమ్మానాన్నల్ని ఎంతో జాగ్రత్తగా చూసుకుంటుంది. ఇందులో శంభు తాతగా సుధాకర్ అద్భుతంగా చేశారు. తన కొడుకు పాత్రలో మురళీధర్ చక్కగా నటించారు. ఈ నెల 14న మా అమ్మ పుట్టినరోజు. అమ్మానాన్నల ఆశీస్సులు ఈ చిత్రంపై ఉంటాయని నా నమ్మకం అన్నారు. కుటుంబంతో కలిసి చూడాల్సిన చిత్రమిది. అందరి మనసుల్ని హత్తుకుంటుంది' అన్నారు దర్శకుడు ఉదయ్. ఈ కార్యక్రమంలో సుప్రియ యార్లగడ్డ, మురళీధర్ గౌడ్, సుధాకర్, గోమతి, పవన్ సీహెచ్, ప్రసాద్, సురేశ్ గంగుల, ప్రజ్వల్ తదితరులు పాల్గొన్నారు.






## కలెక్షన్లలో కనకరాజు దూకుడు

మెగాహీరో వరుణ్ తేజ్ హీరోగా నటించిన తాజా చిత్రం 'కొరియన్ కనకరాజు' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. హారర్ కామెడీ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా మొదటి వీకెండ్‌లోనే సుమారు రూ. 37 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి అద్భుతమైన విజయాన్ని అందుకుంది. ఇక వీకెండ్ ముగిసిన తర్వాత వచ్చిన మొదటి వర్కింగ్ డే అయిన సోమవారం కూడా ఈ సినిమా తన జోరును ఏమాత్రం తగ్గించలేదు. కఠినమైన 'మండే టెస్ట్'ను ఈ చిత్రం చాలా విజయవంతంగా పాస్ అయింది. విడుదలైన నాలుగో రోజు అయిన సోమవారం ఒక్కరోజే బుక్‌మైషో మరియు డిస్ట్రిక్ట్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా 70 వేలకు పైగా టికెట్లు అమ్ముడవ్వడం విశేషం. దీనివల్ల మొదటి వారపు రోజుల్లోనూ సినిమాకు ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని స్పష్టమవుతోంది. ఇలాగే కలెక్షన్స్ కొనసాగితే రాబోయే రోజుల్లోనూ థియేటర్లలో ఈ చిత్రం హవా మరింత ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ఇదిలాఉంటే, ఈ సినిమా ఘన విజయం సాధించిన సందర్భంగా చిత్ర యూనిట్ సక్సెస్ మీట్‌ను ఘనంగా నిర్వహిస్తోంది. ఈ వేడుకకు మెగాస్టార్ చిరంజీవి ముఖ్య అతిథిగా విచ్చేయనున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్‌గా నటించగా, ఎస్.ఎస్. థమన్ సంగీతం అందించారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు యువి క్రియేషన్స్ మరియు ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మించాయి.




Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. RNI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**